

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 13, మే 2026 16 పేజీలు




# మొక్కజొన్న రైతుల కష్టం



2లో

- 18 రోజులు నుండి కేంద్రాల వద్దనే రైతులు
- వర్షాలకు నానుతున్న మొక్కజొన్న పంట
- తూకం వేసిన మొక్కజొన్న బస్తాలు కేంద్రాల వద్దనే 6 రోజులైనా ట్రాన్స్పోర్ట్ కానీ వైనం
- సీరియల్ నెంబరుగా తూకం వేయని వైనం
- పైలవికారులదే ముందుగా తూకం
- వర్షాలు పడితే పనికిరాని మొక్కజొన్న పంట
- అరచేతిలో ప్రాణాలతో మొక్కజొన్న రైతులు

## కేంద్రాల వద్ద పడి కాపులు



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: ఎండనక వాననక అరుకాలం శ్రమించి పంటలు పండించిన రైతులు విక్రయించేందుకు కేంద్రాల వద్దకు తెచ్చిన ఆ పంటలను గత 20 రోజులుగా విక్రయాలు జరుపకపోవడంతో ఎక్కడ వర్షాలు పడతాయోనని రైతులు అరచేతుల ప్రాణాలు పెట్టుకుని భయం భయంగా రోజులు వెల్లదీస్తున్నారు.రైతులు పంట వేసినాక ఆరు నెలలు కష్టపడి పండించడం ఒక ఎత్తైతే ఆ దిగుబడి వచ్చిన పంటను ధాన్యం కేంద్రాలకు తెచ్చి విక్రయించడానికి తలలు పట్టుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలో 20 మండలాలు ఐదు మున్సిపాలిటీలు ఉండగా ఈ సంవత్సరం రైతులు మొక్కజొన్న పంటను రైతులు ఎక్కువగా వేశారు. మొక్కజొన్న పంటను గత సంవత్సరం జిల్లాలో 35 వేల ఎకరాలు వేయగా ఈ సంవత్సరం జగిత్యాల జిల్లాలో 47 వేల ఎకరాల మొక్కజొన్న పంటను వేశారు. దీంతో ఎకరాకు మొక్కజొన్న పంట 35 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి ఎక్కువగా రావడంతో రైతులు ఆయా ప్రాంతాలలో దగ్గర ఉన్న కేంద్రాలకు విక్రయించడానికి మొక్కజొన్న పంటను తీసుకువచ్చారు.

# కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి





హిందూ ధర్మం కోసం చివరి శ్వాస వరకు పోరాటం కేంద్రమంత్రి 8లో

2లో

## వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి

- భక్తుల కొండంత భక్తితో పులకరించిన అంజన్నాలయం
- వేల సంఖ్యలో దర్శించుకుని మాల విరమణ చేసిన భక్తులు
- ఆలయానికి అర్ధరాత్రి పోటెత్తిన అంజన్న భక్తులు
- జయంతి ఉత్సవాలకి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మల్యాల , ప్రభాతవార్త తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్ర మైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆల యంలో మంగళవారం పెద్ద జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, జయంతి సందర్భంగా రాష్ట్ర నలుమూలలే కాకుండా చుట్టుపక్కల ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్ రాష్ట్రాల నుండి కూడా స్వామివారి దీక్షలు చేపట్టిన భక్తులు సోమవారం అర్ధరాత్రి నుండి తమ అధ్యక్షుల విరమణకు కొండగట్టుకు చేరుకున్నారు, దీంతో ఆలయంలో అర్ధరాత్రి నుండి తెల్ల వారు 3 వరకు భక్తుల రద్దీ కొనసాగింది, జై శ్రీరామ్ జై హనుమాన్.. రామలక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి.. నినాదాలతో కొండగట్టు ఆలయ పరిసరాలు కాషాయ వర్ణమై మారుమోగాయి, హనుమాన్ దీక్షలకు కేంద్రంగా పేరుగాంచిన కొండగట్టు అంజన్న ఆలయం సంవత్సరంలో రెండుసార్లు చిన్న, పెద్ద జయంతి ఉత్సవాలు జరగడం విశేషం.



## ఏసీబీ వలలో గంగాధర ఇంచార్జి సబ్ రిజిస్టర్

- పెద్దపల్లి జిల్లాలో పనిచేసిన కాలంలో అక్రమాలు
- నిజామాబాద్లో అరెస్టు చేసిన అధికారులు

15లో

# కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి

**భక్తుల కొండంత భక్తితో పులకరించిన అంజన్నాలయం**

**వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి**

**వేల సంఖ్యలో దర్శించుకుని మాల విరమణ చేసిన భక్తులు**

**ఆలయానికి అర్ధరాత్రి పోటెత్తిన అంజన్న భక్తులు**

**జయంతి ఉత్సవాలకి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**మల్యాల , ప్రభాతవార్త** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం పెద్ద జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, జయంతి సందర్భంగా రాష్ట్ర నలుమూలలే కాకుండా చుట్టుపక్కల ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్గడ్ రాష్ట్రాల నుండి కూడా స్వామివారి దీక్షలు చేపట్టిన భక్తులు సోమవారం అర్ధరాత్రి నుండి తమ అధ్యక్షుల విరమణకు కొండగట్టుకు చేరుకున్నారు, దీంతో ఆలయంలో అర్ధరాత్రి నుండి తెల్లవారు 3 వరకు భక్తుల రద్దీ కొనసాగింది, జై శ్రీరామ్ జై హనుమాన్,,,, రామలక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి,,,,, నినాదాలతో కొండగట్టు ఆలయ పరిసరాలు కాషాయ వర్ణమై మారుమోగాయి, హనుమాన్ దీక్షలకు కేంద్రంగా పేరుగాంచిన కొండగట్టు అంజన్న ఆలయం సంవత్సరంలో రెండుసార్లు చిన్న, పెద్ద జయంతి ఉత్సవాలు జరగడం విశేషం, కాగా, ఆదివారం ప్రారంభమైన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి, స్వామివారి పుట్టినరోజు జరిగే పెద్ద హనుమాన్ జయంతికి 21 31 41 రోజుల దీక్షలు చేపట్టిన భక్తులు కొండగట్టు అంజన్న సన్నిధికి చేరుకొని మాల విరమణ మండపంలో తమ దీక్షలు నిర్వహించుకున్నారు, వందలాది కిలో మీటర్ల దూరం నుండి స్వామి వారి దీక్షలు స్వీకరించిన భక్తులు కాలినడకన పాదాలకు సాక్స్ ధరించి కొండపైకి నగర సంకీర్తనలతో తరలి రావడంతో కొండగట్టు అంజన్నాలయం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకరించి పోయింది, జయంతి సందర్భంగా భక్తులకు ఇబ్బం దులు కలగకుండా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ లు సోమవారం అర్ధరాత్రి వరకు కొండగట్టులోనే మకాం వేసి ఏర్పాట్లను పరిశీలించారు, ఆలయంలో భక్తులకు తాగునీరు మరుగుదొడ్ల వైద్య సేవలు ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై సూచనలు అందజేసి జయంతి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించారు,

**కొండంత మార్మోగిన రామనామ జపం**

అంజన్న పుట్టినరోజు సందర్భంగా కొండగట్టుకు తరలివచ్చిన దీక్ష స్వాములతో కొండగట్టు పరిసరాలన్నీ కాషాయం మారాయి, అంతేకాకుండా ఆలయ పరిసరాలు భక్తుల రామనామ జపంతో కొండగట్టు మారుమోగింది, దీక్షల విరు మనకు వందల కిలోమీటర్ల నుండి వచ్చిన భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుని దీక్షలు విరమించుకొని స్వామివారిని మనసారా దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఇరుముడితో వచ్చిన దీక్ష స్వాములు స్వామివారి సన్నిధిలో మాల విరమణ తో పాటు ఇరుముడిని స్వామివారి సన్నిధిలో అప్పగించి అంజన్నను తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించుకు న్నారు, మూడు రోజులపాటు జరిగిన జయంతోత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



**స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన వేద పండితులు**

స్వామి వారి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 3 నుండి సాయంత్రం 6 వరకు ఆలయంలో ద్రావిడ ప్రబంధన కార్యక్రమాలు, పారాయణలు, విశేషాలు తులసి అర్చ,న శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాల అలంకరణ, సహస్ర నాగవల్లి, హోమాలు, మహా పూర్ణాహుతి, స్థాపిత ఉత్సవమూర్తికి ఉయ్యాల సేవ, మంత్రపుష్పం, మహానివేదన, తీర్థ ప్రసాదాల వియోగం తో పాటు సామూహిక విష్ణు పారాయణము, అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబియ్యం, ఆలయంలో సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవ, కుంకుమార్చన, మంత్రపుష్పం, మహా దాశీర్వాదం, సామూహిక భజన ,ప్రత్యేక అభిషేకాల , ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారి జయంతికి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మానికి ప్రతీకగా అచంచలమైన సేవా భావానికి ఆదర్శంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు, అంతేకాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వానలు కురిసి పంటలు అధికంగా పండాలని స్వామివారిని వేడుకు న్నట్లు తెలిపారు, హనుమంతుని భక్తి బలం నిస్వార్థ సేవాస్ఫూర్తి ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు,

# పే నియర్‌యాప్ నిర్వహకుడి మోసాలు..

**ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం..!**

**గిరిజన నిరక్షరాస్యులే వారికి టార్గెట్**

**బయోమెట్రిక్ వేలిముద్రతో యాప్ నిర్వహకుడు మనీ డ్రా..!**

**బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు**

**బయ్యారం,మే12,ప్రభాతవార్త:** బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలో పే నియర్ బై యాప్‌తో సామాన్యుల బ్యాంకు ఖాతాల సొమ్మును దొంగిలిస్తూ అడ్డంగా దొరికిన సదరు యాప్ నిర్వహకుడు. వివరాల్లోకి వెళితే అల్లిగూడెం, రామచంద్రపురం, మొట్ల తిమ్మాపురం, భద్రుతండా, రెడ్యాతండా, కస్తూరి నగరం, సింగారం, పెంకుతండా గ్రామాల్లో సామాన్యుల బ్యాంకు ఖాతాలలో వారి అనుమతి లేకుండానే బయోమెట్రిక్ పై వేలిముద్ర వేసి ఖాతాలో ఉన్న డబ్బులను తక్కువ చూపి చెబుతూ వారి డబ్బులను దర్జాగా యాప్ నిర్వహకుడి ఖాతాలోకి బదిలీ చేసినట్లు అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. భద్రుతండాకు చెందిన ధర్మసోత్ హరిలాల్ ఈ నెల 1న తన ఆధార్ కార్డుతో పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంక్ సెంటర్ నడుపుతున్న తొట్టి అశోక్ దగ్గరికి వెళ్లి తమ ఖాతాలో సొమ్ము వివరాలను చెప్పమని అడగ్గా ఖాతాలో సొమ్ము 2700 ఉండగా 2020ఉన్నాయని చెప్పి బాధితుడికి 2000 ఇచ్చి 700రూపాయలు తమ ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలియడంతో తమ సొమ్మును అక్రమంగా కాజేశాడని ఈ నెల 11న స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. పెంకుతండాకు చెందిన గుగులోతు దస్మా ఈ నెల 2న తమ ఆధార్ కార్డు తీసుకొని హర్షిత మినీ బ్యాంకుకు వెళ్లి తమ ఖాతా వివరాలను చూడమని తొట్టి అశోక్ అడగ్గా ఖాతాలో 4500 ఉన్నాయని 4000 ఖాతాదారునికి ఇచ్చినట్లు సమాచారం. అసలు ఖాతాలో 6000 ఉండగా 4500చూపెట్టి 1500రూపాయలు కాజేశాడనే ఖాతాదారుడు వాపోయాడు. ఇలా ఒకే నెలలో ఐదు నుంచి పదిమంది నిరక్షరాస్యుల ఖాతాలో వారికి తెలియకుండా డబ్బులు డ్రా చేస్తూ గత పది సంవత్సరాల నుండి పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంకు సెంటర్ నడుపుతూ మండలంలో వేలాదిమంది ఖాతాల నుండి కోట్ల రూపాయలు దోపిడి చేసినట్లు పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మినీ బ్యాంకు మనీ దోపిడిపై ఒక్కొక్కరుగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇప్పటి వరకు ముగ్గురు పిర్యాదు చేసినట్లు బాధితుల నుండి సమాచారం. మరి కొంతమంది బాధితులు పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామచంద్రపురంలో మినీ బ్యాంక్ దోపిడిపై లోతుగా విచారణ జరిపి ఖాతాదారులకు తెలియకుండా ఆర్థికనేరం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు పోలీసులను వేడుకుంటున్నారు. దీనిపై యాప్ నిర్వహకుడు తొట్టి అశోక్ తన అసలు బండారం బయట పడకుండా గుగులోతు రాజలి సంబందించిన డబ్బులు దొంగతనంగా కొట్టేసిన మహిళ కళ్లా, వేళ్ల బ్రతిమిలాడుతూ వారికి రాజకీయ నాయకులతో ఫోన్‌ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసును వాపస్ తీసుకోవాలని పరువు తీయవద్దని వేడుకుంటున్నట్లు గ్రామస్థుల నుండి సమాచారం. అదే విధంగా పే నియర్ యాప్ నిర్వహకులు మినీ సెంటర్ ఐడిని బ్లాక్ చేసినట్లు సమాచారం. గత పది సంవత్సరాల నుండి రైతులకు, కూలీలకు, రైతుబంధు పథకం, గ్రామీణ ఉపాధిహామి పథకం, రైతుల ధాన్యం విక్రయాలు, తునికాకు సేకరణ డబ్బులు గిరిజనుల ఖాతాల్లో పడడం గిరిజనులు సదరు యాప్ నిర్వహకుడు దగ్గరికి వెళ్లడం మోసపోవడం గ్రామస్థులు గ్రహించలేకపోయారు. దీనిపై ఎస్సై ప్రశాంత్ బాబు వివరణ కోరగా కొంతమంది బాధితులు తమ డబ్బులు మినీ బ్యాంకు నిర్వహకుడు దొంగలించాడని పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

# మొక్కజొన్న రైతుల కష్టాలు

**విక్రయాలకై కేంద్రాల వద్ద పడి కాపులు**

**18 రోజులు నుండి కేంద్రాల వద్దనే రైతులు**

**వర్షాలకు నానుతున్న మొక్కజొన్న పంట**

**తూకం వేసిన మొక్కజొన్న బస్తాలు కేంద్రాల వద్దనే**

**6 రోజులైనా ట్రాన్స్పోర్ట్ కానీ వైనం**

**సీరియల్ నెంబరుగా తూకం వేయని వైనం**

**పైలవికారులదే ముందుగా తూకం**

**వర్షాలు పడితే పనికిరాని మొక్కజొన్న పంట**

**అరచేతిలో ప్రాణాలతో మొక్కజొన్న రైతులు**

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** ఎండనక వాననక అరుకాలం శ్రమించి పంటలు పండించిన రైతులు విక్రయించేందుకు కేంద్రాల వద్దకు తెచ్చిన ఆ పంటలను గత 20 రోజులుగా విక్రయాలు జరుపకపోవడంతో ఎక్కడ వర్షాలు పడతాయోనని రైతులు అరచేతుల ప్రాణాలు పెట్టుకుని భయం భయంగా రోజులు వెల్లదీస్తున్నారు.రైతులు పంట వేసినాక ఆరు నెలలు కష్టపడి పండించడం ఒక ఎత్తైతే ఆ దిగుబడి వచ్చిన పంటను ధాన్యం కేంద్రాలకు తెచ్చి విక్రయించడానికి తలలు పట్టుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలో 20 మండలాలు ఐదు మున్సిపాలిటీలు ఉండగా ఈ సంవత్సరం రైతులు మొక్కజొన్న పంటను రైతులు ఎక్కువగా వేశారు. మొక్కజొన్న పంటను గత సంవత్సరం జిల్లాలో 35 వేల ఎకరాలు వేయగా ఈ సంవత్సరం జగిత్యాల జిల్లాలో 47 వేల ఎకరాల మొక్కజొన్న పంటను వేశారు. దీంతో ఎకరాకు మొక్కజొన్న పంట 35 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి ఎక్కువగా రావడంతో రైతులు ఆయా ప్రాంతాలలో దగ్గర ఉన్న కేంద్రాలకు విక్రయించడానికి మొక్కజొన్న పంటను తీసుకువచ్చారు. మార్క్ ఫెయిడ్ ఆధ్వర్యంలో సొసైటీల ద్వారా కథలాపూర్ మండలం మల్లాపూర్ మేడిపల్లి బీర్పూర్ 4 మండలాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు, అలాగే డి సి ఎం ఎస్ ద్వారా ధర్మపురి మండలం జగిత్యాల రాయికల్ ఇబ్రహీంపట్నం మెట్పల్లి కోరుట్ల గొల్లపల్లి లక్ష్మీపూర్ 8 ప్రాంతాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు .కాగా మొక్కజొన్న పంటను మార్క్ ఫెయిడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించగా జిల్లాలో పలు ప్రాంతాలలో సహకార సంఘాలు, డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో కొంత ఆలస్యం జరగగా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో మొక్కజొన్న రైతులు మొక్కజొన్నను విక్రయించడానికి కేంద్రాల వద్దకు తెచ్చి విక్రయించడానికి సిద్ధంగా ఉండగా మార్కు ఫెడ్ నుండి కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మల్లాపూర్ రాయికల్ మెట్పల్లి జగిత్యాల తోపాటు పలు ప్రాంతాలలో రైతులు మొక్కజొన్న పంటను విక్రయాలకై కేంద్రాలకు తెచ్చి 20 రోజులు కావస్తున్న కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్న కురిసిన వర్షాలకు అనేక ప్రాంతాలలో మొక్కజొన్న తడిసి ముద్ద అయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వారం రోజుల నుండి కొన్ని ప్రాంతాలలో మొక్కజొన్న కొనుగోలు చేస్తుండగా ట్రాన్స్పోర్ట్ చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. తూకం వేసిన మొక్క జొన్న పంట మూడు, నాలుగు రోజుల నుండి కేంద్రాల వద్దనే బస్తాలు ఉంటున్నాయని ట్రాన్స్పోర్ట్ జరగడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో 18 రోజుల కింద పోసిన రైతుల మొక్కజొన్న పంట కొనుగోలు చేయకుండానే వారం పది రోజుల క్రితం తెచ్చిన రైతుల మొక్కజొన్న పంటను ఫైరవేలచే కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు టోకెన్లు ఇస్తే టోకెన్ల ప్రకారం కొనుగోలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాలలో కొనుగోలు చేసిన మొక్కజొన్న ట్రాన్స్పోర్ట్ కావడంలేదని బస్తాలు కేంద్రాల వద్దనే ఉన్నాయని స్థలం సరిపోకపోవడంతో రైతులు ఎక్కడ మొక్కజొన్న పంట పోయాలో తెలియడం లేదని పేర్కొంటున్నారు. వర్షాలు పడక ముందే కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్న పంటను త్వరగా కొనుగోలు చేసి ట్రాన్స్పోర్ట్ చేయాలని ఒకవేళ వర్షాలు పడితే వారి ధాన్యం వాలే అరపెట్టరాదని తడిసిన మొక్కజొన్న దుర్వాసన వచ్చి మొక్కజొన్న ఇత్తులు దొడ్డుగా పెరిగి పాడవి పోతావని వెంటనే వర్షాలు పడకముందే మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి వెంటనే బస్తాలను తరలించాలని రైతులు పేర్కొంటున్నారు. ఇట్టి విషయమై జగిత్యాల మార్క్ ఫెయిడ్ డిఎం హబీబ్ ను వివరణ కోరుదామని ఫోన్ చేయగా అందుబాటులో లేదు.మొక్కజొన్న పంటను కేంద్రానికి తెచ్చి 18 రోజులు కావస్తుంది నాకన్నా తరువాత తెచ్చిన వాళ్ళ మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారు. కొట్టాల జలపతి రెడ్డి జోగిని పెళ్లి కోరుట్ల మండలం నేను మొక్కజొన్న పంటను రాయికల్ వ్యవసాయ మార్కెట్ కు తెచ్చి 18 రోజులు కావస్తుందని ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదని మొన్న కురిసిన వర్షాలతో కొంత తడిసిందని గత నాలుగు రోజుల నుండి కొనుగోలు చేస్తున్నారని నాకన్నా వెనుక వచ్చిన రైతుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్నారని, నాది ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదని వెంటనే నా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని పేర్కొంటున్నారు.. మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదు గన్ని సంచులు హమాలీల కొరత ఉన్నదంటున్నారు ప్రవీణ్ రెడ్డి సిర్పూర్ మల్లాపూర్ మండలం నేను మొక్కజొన్న పంటను 15 రోజుల క్రితం మల్లాపూర్ మండల్ వ్యవసాయ మార్కెట్ కు తీసుకువచ్చానని గత 15 రోజుల నుండి హమాలీలు లేరు గన్ని సంచులు లేవు అని కొనుగోలు చేయడం లేదని 15 రోజుల నుండి ప్రతిరోజు మార్కెట్ కు రావడం పోవడం జరుగుతున్నదని మొన్న కురిసిన వర్షాలకు కొంత మొక్కజొన్న పంట తడిసినదని పూర్తిగా వర్షాలు వాడక ముందే వెంటనే మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి వెంటనే తరలించి రైతులను ఆదుకోవాలని పేర్కొంటున్నారు



# టీఎన్జీఓ రారాజు 'బొంకూరి'.. వరుసగా నాలుగోసారి క్లీన్ స్వీప్

### ఏకగ్రీవంతో చరిత్ర సృష్టించిన శంకర్
### ఉద్యోగ గొంతుకకు మరోసారి పట్టాభిషేకం

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**



నాయకత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ, పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడిగా బొంకూరి శంకర్ వరుసగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ ఏకతాటిపై నిలిచి ఆయన నాయకత్వాన్ని బలపరిచారు. 2017లో జిల్లా ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ, 'అందరివాడు'గా గుర్తింపు తెచ్చుకున్న శంకర్, ఈ ఎన్నికల ద్వారా తన ప్రభావాన్ని మరోసారి చాటుకున్నారు. ఫోర్త్ క్లాస్ ఉద్యోగి నుండి గెజిటెడ్ అధికారి వరకు ఎవరికి ఏ కష్టం వచ్చినా భరోసా కల్పించడంలో ఆయన ముందుంటారని, పదవిని అధికారంలా కాకుండా ఒక బాధ్యతగా భావించే ఆయన మనస్తత్వమే ఈ వరుస విజయాలకు కారణమని జిల్లా ఉద్యోగ లోకం కొనియాడింది.ఎన్నికల అధికారులు డి. శ్రీనివాస్, రవికుమార్ పర్యవేక్షణలో సాగిన ఈ ప్రక్రియలో మొత్తం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయిరెడ్డి సందీప్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా గోపు అనిత, కోశాధికారిగా ఎడ్ల కొమురయ్య బాధ్యతలు చేపట్టారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఏ. శ్రీనివాస్, ఎస్. మహేందర్ రెడ్డి, వి. శ్రీనివాస్, కె. స్వప్న కుమారి, సంయుక్త కార్యదర్శులుగా ఈ. ప్రవీణ్, ఎమ్. శ్రీధర్, బి. రమేష్,పి.



సౌమ్యలు ఎన్నికయ్యారు. పబ్లిసిటీ కార్యదర్శిగా డి. నిశాంత్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. అంజయ్యతో పాటు ఈసీ మెంబర్లుగా శిల్ప, స్వప్న, శివధర్మతేజ, ముస్తఫాలు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధికారులు ప్రభాకర్, రాజశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ.. వరుసగా నాలుగోసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం తనపై బాధ్యతను మరింత పెంచిందని, జిల్లా ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పీఆర్సీ, బదిలీలు, పదోన్నతుల వంటి అంశాల్లో రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. నూతన కార్యదర్శి సందీప్ రెడ్డి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే యువ నాయకత్వానికి అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, శంకరన్న అడుగుజాడల్లో జిల్లాలో సంఘాన్ని మరింత పటిష్టం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు భారీ సంఖ్యలో జిల్లా ఉద్యోగులు పాల్గొని నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ టీవీల ప్రారంభం

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం

**గోదావరిఖని, ప్రభాత వార్త:**



ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర విభాగంలో మంగళవారం డిజిటల్ టీవీలు (ఐఎఫ్‌పీఎస్, ఐడీపీఎస్) ప్రారంభించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ పరికరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకొని



జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ పద్మావతి రంజిత్, కళాశాల ప్రిన్సిపల్ సంజీవయ్య, పేరాల రాజిరెడ్డి పాల్గొన్నారు.కళాశాల సీనియర్ అధ్యాపకులు మంతెన శ్రీనివాస్, కుక్కడపు శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రేప్ కేసులో నేరస్తునికి పదేళ్ల జైలు,జరిమానా

**ఓదెల,ప్రభాతవార్త:**




ఓదెల మండలం పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించింది పోలీస్ స్టేషన్లో ఓదెల మండలానికి చెందిన బాధితురాలు 2024 ఏప్రిల్ 23న ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన రాచర్ల రాయమల్లు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు తన తల్లికి జరిగిన విషయాన్ని తెలుపడంతో పోత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి. అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసును విచారించిన పెద్దపల్లి ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి కె. సునీత నిందితుడిపై అభియోగాలు రుజువుకావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7 వేల జరిమానా విధించారు కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ సాక్ష్యాలను సమర్థంగా ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. దర్యాప్తు, కోర్టు విచారణలో సహకరించిన పోలీసు అధికారులను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేశ్ రెడ్డి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేశ్ రెడ్డి పేర్కొన్నారుజగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం వానాకాలం సీజన్ విత్తనాలపై కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించడం ప్రతి విత్తన సంస్థ,డీలర్ల బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాన్ని పూర్తిగా నిరోధించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండే సన్న రకాల వరి వంగడాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్వేశ్ రెడ్డి సూచించారు.ముఖ్యంగా బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048,జేజిఎల్ 1798, కే ఎన్ ఎం 1638, హెచ్ఎంటి సోనా, జె శ్రీరామ్ వంటి రకాలను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని, రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, టి సీడ్ రీజినల్ మేనేజర్ కే.విష్ణు వర్ధన్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, డీసీఎంఎస్ సీఈవోలు,ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల డీలర్లు,ప్రైవేట్ విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# నేరాలు-దారుణాలు

## శతాధిక వృద్ధురాలు మృతి

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలంలోని రేపాక గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మీసాల మల్లవ్వ మృతిచెం దినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు.వృద్ధురాలు మల్లవ్వ వయస్సు 102 సంవత్సరాలు ఉంటుందని పేర్కొ న్నారు.వయస్సు మీద పడటముతో గత సంవత్సర కాలం నుండి మల్లవ్వ చురుకుగా కనిపించట్లేదని అన్నారు.కానీ మరణించే రెండు రోజుల వరకు కూడా తమ పనులు స్వతాగా చేసుకుంటూ ఉందని, దృఢమైన దంతాలను కలిగి ఉండి,రెండు కళ్ళ చూపు తేజోవంతంగా ఉన్నట్లు తమ కుమారులు నర్సయ్య, కనకయ్య పేర్కొన్నారు.

## ధాన్యం కుప్పపైకి దూసుకెళ్లిన టిప్పర్..తప్పిన ప్రాణాపాయం.

### -రైతుకు తీవ్ర నష్టం

**గొల్లపల్లి, ప్రభాతవార్త :**



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మక్కల కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం సాయంత్రం అతిగా మద్యం సేవించిన టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతో టిప్పర్ నేరుగా మక్కల కుప్పపైకి దూసుకెళ్లింది దీంతో బారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.గంగాపూర్ రైతు మరియు ఇతర రైతులకు చెందిన సుమారు 50 క్వింటాళ్ల మక్కలు చెల్లాచెదురై పనికిరాకుండా పోయాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుండి ధర్మారం వైపు వెళ్తున్న టిప్పర్ వాహనం మండల కేంద్రంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న మక్కల కుప్పపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ కూర్చున్న మండల కేంద్రానికి చెందిన కచ్చు మల్లయ్య అగ్గిమల్లకు చెందిన గుడ్ల రాజిరెడ్డికి గాయాలయ్యాయి వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో అక్కడ పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే గంగాపూర్ గ్రామానికి చెందిన రైతు లైశెట్టి శంకరయ్య తో పాటు ఇతరులకు చెందిన సుమారు 50 క్వింటాళ్ల మక్కలు రోడ్డుపై చెల్లాచెదురై మట్టిలో కలిసిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. తన కష్టార్జిత పంట నాశనం కావడంతో రైతు బోరున విలపించాడు.టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. బాధిత రైతుకు వెంటనే నష్టపరిహారం అందించి, నిరక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు రైతులు డ్రైవర్ రాజలింగు ను పోలీసులకు అప్పగించారు రైతుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దివ్యాంగుడైన యువకుడి ఆత్మహత్య

**మానకొండూర్, ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి చెందిన సీతా రమేష్ (38) దివ్యాంగుడైన యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం తెలిపారు. మానకొండూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సీతా రమేష్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడు రమేష్ తల్లిదండ్రులు గత కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. రమేష్ కు పెళ్లి అయినప్పటి నుండి భార్యతో మనస్పర్థలు ఏర్పడి గొడవలతో విడిపోయారు. గత కొన్ని మాసాలుగా తల్లిదండ్రులు, భార్య ఎవరూ లేక ఒంటరి జీవితంతో అలాగే వికలాంగుడిగా పుట్టడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతుడి చెల్లె కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు మానకొండూరు సిఐ శ్రీలత తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. మృతుడు రమేష్ పుట్టుకతోనే రెండు చేతులకు వేలు లేక పుట్టాడు. ఆయన ఆత్మహత్య చేసుకునేందుకు సీలింగ్ ఫ్యాన్ కు వేసుకునేందుకు చీర ఎలా బిగించుకున్నాడు..? అలాగే ఆయన ఆత్మహత్యపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం ఘటనలో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

**మేడిపల్లి/భీమారం, ప్రభాతవార్త :**

భీమారం మండల కేంద్రంలో వేములవాడ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చలిమడ లక్ష్మీ నరసింహారావు ఆదేశాల మేరకు ఉమ్మడి మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మైనర్ బాలికపై అత్యాచారం ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్ను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికపై జరిగిన ఈ ఘటన సమాజాన్ని కలిచివేసే విధంగా ఉందన్నారు. చిన్నారుల భద్రతపై ప్రజల్లో ఆందోళన పెరుగుతున్న సమయంలో పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం



చేశారు. నాయకులు ఆరోపిస్తూ, బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండడం వల్లే కేసు దర్యాప్తులో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. రాజకీయ ప్రభావం కారణంగా పోలీసులు నిందితుడిపై తక్షణ చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేసి దర్యాప్తుకు సహకరించాలని డిమాండ్ చేశారు. నిందితుడు దేశం విడిచి పారిపోకముందే పోలీసులు వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, కేసును వేగవంతమైన విచారణకు పంపించి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు మానసిక, చట్టపరమైన సహాయం అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మహిళలు, బాలికలపై పెరుగుతున్న దాడులు సమాజానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్న నాయకులు, ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోకపోతే నేరస్తులకు భయం ఉండదన్నారు. చట్టం ముందు ఎవరైనా సమానమేనని, రాజకీయ లేదా ఆర్థిక ప్రభావంతో నిందితులు తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, రాగోజిపేట సర్పంచ్ చెన్నమనేని అజిత్ రావు, మేడిపల్లి సర్పంచ్ మకిలి దాస్, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, మండల నాయకులు చెక్కపల్లి రఘు, కైరంకొండ సుధాకర్, ఉదిగిరి ఆదిరెడ్డి, దేశవేని కృష్ణ, చెన్నమనేని రవీందర్ రావు, లోక జలపతి రెడ్డి, ఎండీ రాజబోస్, పుప్పాల చిన్న భూమయ్య, ఉరుమట్ల చిన్న రాజం తదితరులు పాల్గొన్నారు.




# పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణ ఆనంద్ నగర్ లో గల పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకార్చనలు చేపట్టారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పాల్గొనగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేసి వేద ఆశీర్వచనాన్ని అందించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వసంత గంగాధర్, వార్డు కౌన్సిలర్ జాల మాధవి వినోద్, మున్సిపల్ కోఆప్షన్ సంగ మాలతి లింగం లు ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, నాయకులు సంగ లింగం జాల వినోద్, గుంటుక జ్ఞానేశ్వర్, గుంటుక మహేష్, భక్తులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

**కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :**



దళిత రత్న అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన వన తడుపుల అంజయ్యకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన దళిత రత్న అవార్డును ప్రకటించారు. అవార్డు అందుకున్న గ్రామ మాజీ సర్పంచ్ వి అంజయ్యను సర్పరాజు పూర్ గ్రామ సర్పంచ్ నత్తి రాజ్ కుమార్, ఉపసర్పంచ్ భూమేష్ వార్డు సభ్యులు కుల పెద్దలు ఘనంగా సన్మానించారు.

# రైతు అవగాహన సదస్సు

**కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య మాట్లాడుతూ యూరియాని సిఫారసు మేరకు మాత్రమే వాడాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, రైతులు పంట మార్పిడిని కొనసాగించాలని, మార్కెట్ లో ఎక్కువ అమ్ముతున్న వరి రకాలు పండించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని కొద్ది భాగంలో అయినా సాగుచేయాలని, అలాగే నీటి యాజమాన్యం పై అవగాహన కల్పించారు. వరిలో పంట అవశేషాలను తగులబెట్టకుండా కలియదున్నాలని సూచించారు. మండల వ్యవసాయధికారి నాగమణి మాట్లాడుతూ యూరియా బుకింగ్ అప్ గురించి అలాగే రైతులు లోతు దుక్కులు చేసుకుంటే కలిగే లాభాలను వివరించారు. హెచ్ఈవోబి అన్వేష్ మాట్లాడుతూ కూరగాయల సాగు, మల్చింగ్ సబ్సిడీలు ఆయిల్ పామ్ సాగు, మార్కెటింగ్ అలాగే సబ్సిడీల పైన అవగాహన కల్పించారు. ఏఎంసీ చైర్మన్ పి. అంజిరెడ్డి మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏఈ వోలు ఆర్. శ్రీహరి , పి. నరేష్ ఆత్మ మెంబెర్ జి. హనుమక్క, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హిందూ ఏక్తా యాత్రకు సురభి నవీన్

**కోరుట్ల, ప్రభాతవార్త :**



హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీనగర్ లో జరుగనున్న హిందూ ఏక్తా యాత్రకు కోరుట్ల నియోజకవర్గం నుండి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు.

# శివాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జగిత్యాల మండలం గోపాల్ రావు పేట గ్రామంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొని, గ్రామస్తులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అని, ఆయన జన్మదినం మనసుకు, శరీరానికి శక్తిని, నిబద్ధతను ఇచ్చే పర్వదినమని పేర్కొన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గుణానికి ఆంజనేయుడే నిదర్శనమని, ఆ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షి ంచారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దావ తిరుపతితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



# మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహణ

**మేడిపెల్లి, ప్రభాతవార్త :**

మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 99 డేస్ యాక్షన్ ప్లాన్ – ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మేడిపెల్లి మండల కేంద్రం లోని ఆదర్శ సమైక్య మహిళా సంఘం సమావేశం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, హక్కులు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా "బేటీ బచావో – బేటీ పడావో" పథకం, ఆడపిల్లల విద్య ప్రాముఖ్యత, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ అంశాలు, మొబైల్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, బాల్యవివాహాల నిషేధ చట్టం, మహిళా రక్షణ చట్టాలపై వివరించారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112, 181, 14567, 1098 గురించి తెలిపారు. సఖి సేవలు, అంగన్వాడి సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, డ్రగ్స్ వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై కూడా అవగాహన కల్పించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అందుబాటులో ఉన్న పలు ఫైనాన్షియల్ స్కీమ్స్ గురించి వివరించారు. మహిళల అభివృద్ధి, భద్రత, స్వయం సాధికారత లక్ష ్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, సీసీలు, వీవోఏలు, సఖి స్టాఫ్, డీహెచ్ఈడబ్ల్యూ స్టాఫ్ పాల్గొన్నారు.



# పశువుల అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

**–అంతర్ జిల్లా చెక్ పోస్ట్ తనిఖీ చేసిన డీసీపీ**

**తాండూర్, మే 12, ప్రభాతవార్త :**

అంతర్ జిల్లా చెక్ పోస్టు గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయాలని మంచిర్యాల డిసిపి భాస్కర్ అన్నారు. తాండూర్ మండలంలోని రేపల్లెవాడ సమీపంలో గల అంతర్ జిల్లా చెక్ పోస్టును సోమవారం అర్ధరాత్రి డిసిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి వాహన వివరాలు రిజిస్టార్ లో నమోదు చేయాలనీ సూచించారు.పశువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, పశువుల అక్రమ రవాణా జరిగితే స్థానిక పోలీసులకు, 100కు



కాల్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి డీసీపీ పలు సూచనలు చేశారు. డీసీపీ వెంట తాండూర్, బెల్లంపల్లి 1 టౌన్ సీఐలు దేవయ్య, శ్రీనివాస్ రావు, తాండూర్ ఎస్సై ప్రసాద్ ఉన్నారు.

# వేసవి శిబిరాలతో ప్రతిభ వెలికితీత

**ధాన్యం తరలింపునకు లారీల సేకరణ ముమ్మరం**

**కలెక్టర్ భవేశ్ మిశ్రా క్షేత్రస్థాయి పర్యటన**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: మే 12, ప్రభాతవార్త:**



విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు వేసవి శిబిరాలు దోహదపడతాయని, రైతుల ధాన్యం తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పట్టణంలోని వేసవి శిబిరాన్ని సందర్శించడంతో పాటు, గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిభకు వేదిపట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ శిబిరానికి హాజరై ఆటలు, పాటలు, యోగా, డ్యాన్స్‌లో శిక్షణ పొందాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వేసవి శిబిరాలతో నైపుణ్యాల పెరుగుదలతో పాటు దాగిఉన్న ప్రతిభ బయటపడుతుంది.ఉపాధ్యాయులకు శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని అంశాలు చక్కగా నేర్పించాలి. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ, "అధైర్య పడవద్దు. అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారు. సబ్జెక్టులను



శ్రద్ధగా చదువుకోండి. సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోండి" అని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి, విద్యార్థుల భయాలు, సందేహాలు తొలగించి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్న నిల్వలు పెరగకుండా సకాలంలో మిల్లులకు తరలించేందుకు కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను పరిశీలించారు.

**ధాన్యం తరలింపు.. టోల్‌ప్లాజా వద్ద కలెక్టర్ తనిఖీ**

కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్న నిల్వలు పెరగకుండా సకాలంలో మిల్లులకు తరలించేందుకు కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను పరిశీలించారు.కీలక ఆదేశాలు:టోల్‌ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి, ధాన్యం రవాణాకు వినియోగించాలి. డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితి వివరించాలి. న్యూ సాంగ్వి గ్రామ రహదారి వద్ద కూడా లారీల సేకరణ తీరు పరిశీలించారు. షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించి నిరంతరాయంగా లారీల సేకరణ కొనసాగించాలి.విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు వేసవి శిబిరాలు పునాది అయితే, రైతు కష్టానికి గిట్టుబాటు ధర కల్పించడం మన బాధ్యత. రెండింటిలోనూ నిరక్ష్యం వద్దు." అని కలెక్టర్ అన్నారు.

# నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

**తొర్రి అరవింద్, ఉపాధ్యక్షులు, మానకొండూర్ నియోజకవర్గం**

**తిమ్మాపూర్, ప్రభాత వార్త :**దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తొర్రి అరవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు..కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.



దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చాయని, ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ సంక్షోభానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# నేడే ఎస్సీ కోర్పొరేషన్ ఇంటర్వ్యూలు

**ప్రభాత వార్త వాజేడు** వాజేడు మండలంలో 2025 26 ఆర్థిక సంవత్సరం నకు సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ పై మంజూరీ చేయబడు వివిధ యూనిట్లకుకొరకు ఆన్లైన్లో అప్లై చేసుకున్న అభ్యర్థులు మొత్తం (52) వారికి బుధవారం రోజున ఉదయం 11.00 గంటలకుమండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి కమిటీ ద్వారా జాయింట్ స్క్రీనింగ్ ( ఇంటర్వ్యూ లు ) నిర్వహించడం జరుగుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీకాంత్ ఒక ప్రకటన లో తెలిపినారుఇట్టి సమావేశము నకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారు, సంబంధిత మండల స్థాయి అధికారులు అందరూ హాజరు అవుతారని ఒక ప్రకటనలో తెలిపారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

**ఎల్లమ్మ కాలువను పరిరక్షిస్తాం..**

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు**

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**



రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని, చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు కొనసాగిస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామ పెద్దచెరువు ద్వారా సాగునీరు అందించే ఎల్లమ్మ కాలువ కబ్జాకు గురైన నేపథ్యంలో మంగళవారం బొంతకుంటపల్లి–గర్రెపల్లి గ్రామాల మధ్య ప్రాంతాన్ని అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కాలువను సర్వే చేసి పూడిక తొలగించి, ఐదు గ్రామాల రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులకు అవసరమైన సాగునీరు సమృద్ధిగా అందిస్తున్నామని తెలిపారు. సాగునీటి కాలువలను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, కాలువలను ఎల్లప్పుడూ పరిరక్షిస్తామని పేర్కొన్నారు.నిండు ఎండాకాలంలో కూడా రైతులకు అవసరానికి మించి సాగునీరు అందించామని తెలిపారు. రైతుల సమస్యలపై తాను ఎప్పటికప్పుడు పోరాడానని, గతంలో సాగునీటి సమస్యలపై నిరసనగా ఎస్సారెస్పీ గేట్ల వద్ద ఆందోళనలు నిర్వహించగా తనపై కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. ఇటీవల ఆ కేసులకు సంబంధించి కోర్టుకు కూడా హాజరయ్యానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, తాను ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఎడ్ల జోగి రెడ్డికి కన్నీటి వీడ్కోలు

**తిమ్మాపూర్,ప్రభాత వార్త :**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,మాజీ జెడ్పిటిసి, ఎంపీటీసీ,బిజెపి సీనియర్ నాయకు లు ఎడ్ల జోగిరెడ్డి(61) గత సోమవారం హైదరాబాదు లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మంగళవారం స్వగ్రామం తిమ్మాపూర్ లో ఆయన భౌతిక కాయాన్ని సంద ర్శించి,ఘన నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతి,తీవ్ర సంతాపం వ్యక్తం చేసి,చివరి మజిలీ అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్,బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వి రామ కృష్ణా రావు,తెలంగాణ ఉద్యమ కారు ల ఫోరం నాయకులు ఓరుగంటి ఆనం ద్,కనకం కుమారస్వామి,సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి,వివిధ పార్టీల నాయ కులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి,సింగిరెడ్డి స్వామి రెడ్డి,గుజ్జుల రవీందర్ రెడ్డి, దుంద్ర రాజయ్య,మ్యాతగి లక్ష్మ ణ్, రావుల రమేష్,నరహరి జగ్గారెడ్డి, సుగుర్తి జగదీశ్వర చారి,ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,ఉప్పు రవీందర్,కలర్ సత్తన్న లతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు,కార్యక ర్తలు,తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

**ధర్మపురి,ప్రభాతవార్త :**డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన పెద్దపెల్లి జిల్లా గోపాలరావు పేటకు చెందిన శనిగరపు రాకేష్ (28) అనే యువకుడికి మంగళవారం ధర్మపురి కోర్ట్ న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. ఇట్టి కేసుకు సంబంధించి ధర్మపురి ఎస్సై మహేష్ వివరిస్తూ,ధర్మపురి పట్టణంలో రెండు రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా,రాకేష్ పరిమితికి మించి ఆల్కహాల్ సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు.అతడిని ధర్మపురి కోర్ట్ లో న్యాయమూర్తి ముందు హాజరుపరచగా,రాకేష్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

## ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్...

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;** శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) వేడుకున్నారు. హనుమాన్ జయంతిని పురస్క రించుకొని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ జమ్మికుంట పట్టణ పరిధిలోని గణేష్ నగర్ సంజీవ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లా డుతూ శ్రీరామ భక్త ఆంజనేయ స్వామి వారి ఆశీర్వాదంతో జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ హనుమాన్ భక్తులకు



హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, బూరుగుపల్లి రాము, చరణ్, రావికంటి రాజ్ కుమార్, పిట్టల రమేష్, జక్కే రవీందర్, అఖిలేష్, హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

---

## తెలంగాణ ఉద్యమకారుల అధ్యక్షురాలిగా రమ

### మీడియా కన్వీనర్ గా రాజు..

**ఇల్లందుకుంట, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం ఇల్లంతకుంట మండల కేంద్రంలో నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి హాజరై మహంకాళి రమ ఇల్లంతకుంట మహిళ అధ్యక్షురాలుగా, ఇల్లంతకుంట మండల సోషల్ మీడియా కన్వీనర్ గా పుట్ట రాజులను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతు నిన్న తెలంగాణ మహిళా కమిషన్ నియమించిన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల పెద్దపీట వేసినందులుగాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంత్ చారి ఒంటిపై పెట్రోల్ పోసుకొని మంటల్లో తెలంగాణ అని నినాదం చేయడం జరిగిందన్నారు. వారి



కుటుంబానికి శంకరమ్మ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించడం, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలైన నియమించినందుకు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తించడానికి కమిటీ రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కన్వీనర్ రమేష్ రెడ్డి మండల అధ్యక్షుడు రాజబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ భూమి రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, రాజీరు సమ్మిరెడ్డి, రాజయ్య, మధుసూదన్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

---

## అదనపు కట్నం కోసం వేధించిన భర్త పై కేసు నమోదు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కవ్వంపల్లి భాగ్యలక్ష్మికి జమ్మికుంట మండలంలోని నగరం గ్రామానికి చెందిన కవ్వంపల్లి రమేష్ తో 2012 సంవత్సరంలో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగినది. వివాహ సమయంలో వారి తల్లిదండ్రులు ఐదు లక్షల నగదు నాలుగు తులాల బంగారం ఇతర లాంఛనాలతో ఘనంగా పెళ్లి జరిపించినారు. తన భర్త కవ్వంపల్లి రమేష్ సింగరేణిలో ఉద్యోగం చేసుకుంటూ ఉండేవాడు. వారికి ఒక బాబు ఒక పాప సంతానం కలరు. గత నాలుగు సంవత్సరాలుగా తన భర్త అయిన రమేష్ తాగుడుకు అలవాటు పడి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడనీ అదనపు కట్నం తీసుకురావాలని లేదంటే ఇంట్లో నుండి వెళ్లిపోవాలని వేధించగా విషయం తన తల్లిదండ్రులకు తెలిపగా వారు 11 /4/ 2026 రోజున 50 వేల రూపాయలు అదనపు కట్నంగా పంపినారు. వారి తల్లిదండ్రులు పెట్టిన నాలుగు తులాల బంగారం కూడా తన భర్త కుదువ పెట్టినాడనీ ఇట్టి విషయంలో పెద్దల సమక్షంలో నగరం సర్పంచి అయిన సంపత్ ఆధ్వర్యంలో పంచాయతీ జరిగినది. అయినా అతని ప్రవర్తనలో మార్పులు రాలేదు. తేదీ 11 /5 /2026 రోజున తన భర్త తాగి వచ్చి ఆ కారణంగా తలుపులు పెట్టి నానాభూతులు తిడుతూ కర్రతో తన తలపై కొట్టినాడనీ తల నుండి రక్తం కారుతున్న నిన్ను చంపుతా అని గదిలో బంధించి బెదిరించినాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

---

## బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలి

సైదాపూర్, ప్రభాతవార్త

మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు బండి భగీరథ్ పై చట్టరీత్యా చర్యలు తీసుకుని, వెంటనే అరెస్టు చేయాలని భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఫోక్సో కేసు నమోదై రోజులు గడుస్తున్నా ఇంత వరకు అరెస్ట్ చేయక పోవడం పట్ల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించ్చారు. న్యాయం పేదవారికైన.... పెద్ద వారికైనా ఒకే విధంగా ఉండాలన్నారు. మైనర్ బాలిక ఫిర్యాదు వంటి అత్యంత సున్నితమైన అంశంలో ప్రభుత్వం, పోలీసులు భాద్యతాయుతంగా వ్యవహరించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, కేసు నమోదైన బండి భగీరథ్ ఎక్కడ ఉన్నాడు....



ఎందుకు అరెస్టు చేయడం లేదని, చట్టం సామాన్యులకులకు ఒకలా.... అధికారంలో ఉన్న నాయకులకు మరోలా ఎందుకు ఉంటుంది అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ తొంట రజినీకాంత్, భారత రాష్ట్ర సమితి మండల ప్రధాన కార్యదర్శి చెల్మల రాజేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ వీరస్వామి, నాయకులు పైడిపల్లి రవీందర్ గౌడ్, మునిపాల శ్రీనివాస్, పి. నారాయణ, జీ. శ్రీధర్, రవి, మహీపాల్ సింగ్ లు పాల్గొన్నారు.

---

## కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అద్భుత ఫలితాలు

### -- చైర్ పర్సన్ సుహాసిని



**జమ్మికుంటహుజురాబాద్, ప్రభాత వార్త:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల్లో భాగంగా 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమెడియన్ తరగతులు, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం 12 నుండి జూన్ 3 వరకు జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి క్రమం తప్పకుండా హాజరై పరీక్షల్లో పాస్ కావాలన్నారు. ఈ శిక్షణలో హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి ఫెయిల్ అయిన 29 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఎంఈఓ హేమలత, ఇల్లంతకుంట ఎంఈఓ రాములు, హెచ్ఎం శోభారాణి, సబ్జెక్టు ఉపాధ్యాయులు జయ, లక్ష్మణ్, రాజిరెడ్డి, రాధిక, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

---

# మెట్‌పల్లి వార్త

## వేసవిలో ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

### ఎంపీడీవో గణేష్



**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :** వేసవికాలం దృశ్య ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో గణేష్ అన్నారు. మండలంలోని యామా పూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో గణేష్ మంగళవారం పరిశీలించారు. అనంతరం యావపూర్ సర్పంచ్ కనుక నాగేష్ తన సొంత డబ్బులతో ఉపాధి హామీ కూలీలకు తలకు కట్టుకోవడానికి తువ్వాళాలు, చల్ల ప్యాకెట్లను ఉపాధి హామీ కూలీలకు ఎంపీడీవో చేతుల మీదుగా సర్పంచ్ నాగేష్ అందజేశారు. అనంతరం పేద రైతు కూలీ లచ్చన్న గత రెండు రోజుల క్రితం పూరి గుడిసే షార్ట్ సర్క్యూట్తో కాలిపోగా ఆయనతో నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శులు నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్, ఉపసర్పంచ్ దామెర లావణ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు చిట్యాల వినోద్, బందెల రాజేందర్, పింగి సురేష్, భూమేష్, బత్తుల సురేష్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లీనరీకి బయలు దేరిన జన సమితి నాయకులు

మెట్ పల్లి కల్చరల్,ప్రభాత వార్త:



ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ యం.కోదండరాం అధ్యక్షతన హైదరాబాద్ జల విహార్ లో జరుగుతున్న తెలంగాణ జన సమితి 4వ ప్లీనరీ కి మెట్పల్లి నుండి నాయకులు, కార్యకర్తలు మంగళ వారం ఉదయం బయలుదేరి వెళ్లారు. కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జ్, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజక వర్గం లోని వివిధ ప్రాంతాల నుండి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు కంతి రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జిల్లాపెల్లి దిలీప్, వివిధ విభాగాల కోరుట్ల నియోజక వర్గ నాయకులు వన్నెల శశి, రాంపెల్లి శ్యామ్, కనక మహేష్, పత్తిరెడ్డి శ్రీనివాస్, చిట్యాల రాజేందర్, గజ్జ రాజేందర్, ల్యాడే రాజేందర్, నాచుపల్లి తిరుపతి, కంతి ప్రశాంత్, చెట్పల్లి నరేందర్, మైలారపు లక్ష్మణ్, బర్ల బద్రి, పిప్పెర రాజేష్, ఒడ్నాల శేఖర్, కనక లక్ష్మణ్, యం.డి.రిజ్వాన్, మార శివ, నాచుపల్లి వినయ్, పాల్గొన్నారు.

## బస్సును యదావిధిగా నడిపించాలని ధర్నా

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

రోడ్డు రవాణాకు చెందిన బస్సు యదావిధిగా నడపాలని మండలములోని పెద్ద లింగాపూర్ గ్రామస్తులు మంగళవారం నిరసన చేశారు.పెట్రోల్ బంక్ వద్ద గ్రామపంచాయతీ సర్పంచ్ గన్నెరం వసంత,పాలక వర్గ సభ్యులు,గ్రామ ప్రజలు కలిసి సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు ముందు నిరసన తెలిపారు.దశాబ్ద కాలంగా సిరిసిల్ల నుండి ఇల్లంతకుంటకు వెళ్లే ఆర్టీసి బస్సు జిల్లెల్ల దాచారం పెద్ద లింగాపూర్ మీదుగా వెళ్లేదని,గత 15 రోజుల నుండి గ్రామంలోకి బస్సు రావడం లేదని ఆరోపించారు. విషయాన్నీ సిరిసిల్ల డి ఎం కి ఫోన్ ద్వారా సమాచారం అడిగితే సమాధానం లేకపోవడముతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. విషయం



తెలుసుకున్న స్థానిక పోలీసులు, డిపోకు భాద్యులు వచ్చి యదావిధిగా బస్సు నడిపిస్తామని హామీ ఇవ్వడముతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లవేణి రమేష్,పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

202627 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగంగా పాఠశాలల్లో ప్రవేశాల కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. 3వ, 5వ, 8వ తరగతులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన పరిశీలించి, గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కేటగిరీలో సీట్లకు తల్లిదండ్రుల సమక్షంలో డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ తరగతికి ముగ్గురు అబ్బాయిలు, ఒక




అమ్మాయి, 5వ తరగతికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి, 8వ తరగతికి ఒక అబ్బాయిని ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి సంగీత, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ లపై సమగ్ర విచారణ జరపాలి

ఏ ఐఎఫ్టియు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దశరథం

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇల్లు డబల్ బెడ్ రూమ్ లపై సమగ్ర విచారణ జరిపించాలని ఐఎఫ్టియు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దశరథం డిమాండ్ చేశారు . మంగళవారం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో దశరథ మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలు ఎన్నిసార్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం సామాజిక పెన్షన్ల కోసం దరఖాస్తు చేసిన అధికారుల చుట్టూ నాయకుల చుట్టూ తిరిగిన మంజూరు కావడం లేదు అన్నారు.




అనర్హులకు మంజూరు అవుతున్నాయని పేర్కొన్నారు . సమగ్ర విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, ఏందిరా మా ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవదాస్ , ఎల్లయ్య, సంధ్య ,కనకవ్వ , శ్రీనివాస్, బాల్ రాజు పాల్గొన్నారు

## బండిసంజయ్ వెంటనే రాజీనామా చేయాలి

ముస్తాబాద్ ప్రభాత వార్త:



కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండిసంజయ్ కుమారుడు పై ఫోక్సో కేసు నమోదుచేసిన ఇప టివరకు అతడిని పోలీసులు చేదించకపోవడంపై చాలా అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్మెట రాజు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమ్ శాఖ సహాయమంత్రి తనయుడు తప్పుచేస్తే శిక్షించడానికి పోలీసులు వెనుకంజ వేయడం చాలా దురదృష్టకరమని అన్నారు.దీనిపై రాష్ట్ర మహిళా కమిషన్ మాట్లాడటం లేకపోవడం చాలా బాధాకరం అని అన్నారు.బడా బాబుల చేతిలో పేదపిల్లలు చాలా మంది బలి ఆవుతున్నా.పోలీసు యంత్రాంగం రాజ్యాంగ పరిధిలో పని చేస్తుందా?లేదా బడా బాబుల పిల్లల్ని కాపాడేందుకు పని చేస్తుందా? అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఫోక్సో కేసు విషయంపై ఎంతటి వారీనైన చట్టం విడిచిపెట్టదు చట్టం ఎవరికి చట్టం కాదు అనే విషయాన్నిగుర్తుంచుకోవాలని,బాధిత కుటుంబ పక్షాన న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం.

సూర్యాపేట, మే 12 (ప్రభాత వార్త)



: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శాంతినగర్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. భీవ ంవరానికి చెందిన విగ్నేష్ బైక్ పై సూర్యాపేట నుండి దురాజ్‌పల్లి వైపు అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న మయూరి ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో విగ్నేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్సై శివతేజ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## మేజర్ పంచాయతీలో కొరవడిన సమన్వయం

గంభీరావుపేట, ప్రభాతవార్త:

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చాందంగా ఉంది ఇక్కడి పరిస్థితి. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గంలో సమన్వయం కొరవడింది. 16 మంది వార్డు సభ్యులు ఉన్న పంచాయతీలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సుతి లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మేజర్ గ్రామపంచాయతీకి 300 ఎల్ఈడి లైట్లు వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కేటీఆర్ అందించారు. గ్రామంలో వీధిలైట్ల కొరత ఉన్న ప్రదేశాల్లో లైట్లు అమర్చాలనే లక్ష్యంతో వీధిలైట్లు మంజూరు చేశారు. లైట్లు వచ్చి 10 రోజులు గడుస్తున్నా ఏర్పాటు చేయదలచిన స్థలాలను గుర్తించి లైట్లు ఏర్పాటు చేసిన దాఖలాలు ఇక్కడ కనిపించడం లేదు. లైట్లు బిగించాలని సంబంధిత పంచాయతీ సిబ్బందిని మెజారిటీ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శికి విన్నవించిన ఫలితం కానరావడం లేదని సభ్యులు బహాటంగా విమర్శిస్తున్నారు. కార్యాలయం నుండి తమకు ఆదేశాలు ఉంటేనే లైట్లు బిగిస్తామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారని సభ్యులు వాపోతున్నారు. పంచాయతీ పాలన విషయంలో ఇతరుల జోక్యంపై మండిపడుతున్నారు. పంచాయతీ పాలకవర్గం ఎన్నికైన మొదల నుండి మండలానికి ఆదర్శంగా నిలవాల్సిన మేజర్ పంచాయతీ లో సమన్వయం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల సమిష్టి ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లలేక పోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గం కొలువుదీరి ఆరు నెలలు తిరక్కముందే మెజార్టీ వార్డు సభ్యులు వీధినెక్కి పోరాటం చేసిన దాఖలాలు లేకపోలేదు. ఆదర్శంగా ఉండాల్సింది పోయి పాలక వర్గ పనితీరు ఇక్కడ వెక్కిరిస్తున్నాయి. మేజర్ పంచాయతీ సర్పంచ్ కు ఇప్పటికీ ఫోన్ నెంబరు లేకుండా ఉండి, స్వతగా సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని పాలకవర్గ సభ్యులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. సర్పంచ్ తీరుపై పోరాటాలు చేసే పరిస్థితి ఇక్కడ నెలకొందని ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. మంజూరైన వీధిలైట్ల బిగింపు విషయమై పంచాయతీ కార్యదర్శి వినీల్ రెడ్డిని మంగళవారం వివరణ కోరగా, పాలకవర్గ సభ్యులు వీధిలైట్లు అమర్చేందుకు సిబ్బందిని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఆదేశాల మేరకు తాను నిర్ణయం తీసుకోనున్నట్లు వారికి తెలిపినట్లు వివరించారు. ఇందులో తన ప్రమేయం ఏది లేదని, స్వతగా నిర్ణయం తీసుకునే అవకాశం లేదన్నారు

# సిరిసిల్ల వార్త



## మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పుష్పలత గౌడ్



ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా తీగల పుష్పలత గౌడ్ మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులను మంగళవారం అందజేశారు.మండలములోని అనంతారం గ్రామానికి చెందిన తీగల పుష్పలత గౌడ్ మాజీ ఎంపీటీసీగా వ్యవహరించారు.తన నియామకానికి సహకరించిన మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణకు,మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ప్రభుత్వ ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని,అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు

## సీసీరోడ్డు పనులకు భూమి పూజ

ముస్తాబాద్ ప్రభాత వార్త:



అవునూరు ఇందిరమ్మ కాలనీలో ఎంపీ నిధుల కింద మంజూరు అయిన 20 లక్షల వ్యయంతో సర్పంచ్ నక్కదాసరి రవి ఆధ్వర్యములో సీసీ రోడ్డు పనులకు మంగళవారం భూమిపూజ చేసారు.ఈ కార్యక్రమములో ఎంపిడిఓ లచ్చాలు ఉపసర్పంచ్ నక్కలరాజు,వార్డు సభ్యులు తోట అంజయ్య,నేరేళ్ల స్వామి,బద్దెపూరీ శ్రీనివాస్,పాశికంటి బాలయ్య,పొన్నాల పద్మారెడ్డి,కనమేని శ్రీనివాస్ రెడ్డి,దాసరి విశ్వనాథ్ పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున్ లు పాల్గొన్నారు

## గంగాధర క్షేత్రంలో వార్షికోత్సవ వేడుకలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండల కేంద్రంలో ఉన్న గంగాధర క్షేత్రంలో అష్టమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితులు,ఆలయ వ్యవస్థాపకుడు మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.మహన్యాస పూర్వక రుద్రాభిషేకం,మహా చండీ హోమం,స్పటిక లింగానికి విశేష ద్రవ్యాలచే అభి షేకాలను నిర్వహించారు.అనంతరం గంగాధర క్షేత్రం లోని భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు

# హిందూ ధర్మం కోసం చివరి శ్వాస వరకు పోరాటం

-కరీంనగర్‌లో కాషాయ సందడి

- ఘనంగా నిర్వహించిన హిందూ ఏక్తా యాత్ర

- జై శ్రీరామ్ నినాదమే హిందూ ధర్మానికి శ్రీరామరక్ష"

- బండి సంజయ్‌కేసులు, జైలు, దాడులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు

- కుమారుడి వ్యవహారంపై భావోద్వేగానికి గురైన కేంద్ర మంత్రి

ఖ-అవినీతి గడీలను బద్దలు కొడతా"

- కార్యకర్తల్లో జోష్ నింపిన సంజయ్





**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:**

హిందువుల ఐక్యత, ధర్మ పరిరక్షణ లక్ష్యంగా గత 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర మంగళవారం కరీంనగర్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హిందూ ధర్మం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానని ప్రకటించారు. యాత్ర సందర్భంగా కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద కాషాయ జెండా ఎగురవేసిన ఆయన, "జై శ్రీరామ్" నినాదమే హిందూ ధర్మానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. హిందూ సమాజానికి ఎలాంటి ఆపద వచ్చినా ప్రాణాలకు తెగించి పోరాడేందుకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ఒక చిన్న కార్యకర్తగా ప్రారంభించానని గుర్తు చేసుకున్న సంజయ్, గల్లీ గల్లీలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల మద్దతు సంపాదించానన్నారు. గుండెలో స్టంట్ ఉన్నా లెక్కచేయకుండా 1600 కిలోమీటర్ల పాదయాత్ర చేశానని తెలిపారు. గత పాలకులు కేసులు పెట్టి జైలుకు పంపినా, రాళ్లతో దాడులు చేసినా భయపడలేదని వ్యాఖ్యానించారు. ఇటీవల తన కుమారుడిపై జరుగుతున్న ప్రచారంపై ఆయన భావోద్వేగానికి గురయ్యారు. "సమాజం కోసం ఎక్కువ సమయం కేటాయించి, నా కొడుకుకు సమయం ఇవ్వలేకపోయాను. అది నా తప్పే.. నన్ను క్షమించండి" అంటూ కార్యకర్తల ముందే ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని, న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. అవినీతి వ్యవస్థను, కుట్ర రాజకీయాలను తుదముట్టిస్తానని హెచ్చరించిన సంజయ్, తనను మరియు కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని విడిచిపెట్టబోమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రసంగానికి కార్యకర్తలు జై శ్రీరామ్"బండి సంజయ్ జిందాబాద్" నినాదాలతో మద్దతు తెలిపారు. హిందూ ఏక్తా యాత్ర నేపథ్యంలో కరీంనగర్ నగరంలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేయగా, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**



జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం సేకరణ, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం కొడిమ్యాల మండలంల చెప్యాల గ్రామంలోని శ్రీ లక్ష్మి గణేష్ ఇండస్ట్రీస్, లక్ష్మి సరస్వతి ఇండస్ట్రీస్, లక్ష్మీనరసింహ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ ్మ సాయి ఇండస్ట్రీస్‌తో పాటు నమిలికొండ గ్రామంలోని నరసింహ, ధరణి దత్త సాయి, చాముండి రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూకొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులు మరియు రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకోవాలని అలాగే మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు, అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సివిల్ సప్లైస్ డిఎం జితేంద్ర ప్రసాద్ , తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో చేరండి.. భవిష్యత్తును నిర్మించుకోండి

ఇంటర్ విద్య వారోత్సవాల్లో విద్యార్థులకు అవగాహన

– అడ్మిషన్ల ప్రచారానికి శ్రీకారం

**కొడిమ్యాల, ప్రభాతవార్త:**



కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ విద్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అడ్మిషన్ల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయడం సంతోషకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో మెరుగైన బోధనతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మంగళవారం నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి. జయశీల, డా. పి తిరుపతి, సిహెచ్ నర్సయ్య, ఎస్. శ్యామ్ కుమార్, డి. శ్రీకాంత్, ఆఫీస్ సిబ్బంది ఎం.డి. బాబూమియా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్ష

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** మూడేళ్ల డిప్లమో కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలీసెట్ 2026 పరీక్షలు బుధవారం అనగా నేడు నిర్వహించనున్నామని జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలు విడుదల చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది 2494 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారి దరఖాస్తులు మరియు వారి సంఖ్య.... అమ్మాయిలు ఒక 1424 మంది, అబ్బాయిలు 1070 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 2494 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

# జగిత్యాల వార్త

## ఈ నెల 14 న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం

బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మోతే ఉమాకాంత్ శర్మ

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త..**



ఈనెల ఈనెల 14న హైదరాబాదులో జరిగేబ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా బసవరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారాం కి జిల్లాలోని బ్రాహ్మణ బంధువులు అందరూ తరలి రావాలని బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మోతే ఉమాకాంత్ శర్మ అన్నారు. జగిత్యాల బ్రాహ్మణ వీధిలోని రామ మందిరంలో జిల్లా బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఉమాకాంత్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా బసవరాజు శ్రీనివాస్ ను నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు అలాగే మంత్రి లక్ష్మణ్ కుమార్ కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు ధన్యవాదాలు కలుపుతూ ఈనెల 14వ తేదీన హైదరాబాద్లో జరిగే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా బసవరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని బ్రాహ్మణ బంధువులు పాల్గొని బసవరాజు శ్రీనివాసును జిల్లాలోని బ్రాహ్మణ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఘనంగా సన్మానించడానికి తరలిరావాలని వారి కోరారు. ఈ సమావేశంలో మేడిపల్లి శ్రీనివాస్ శర్మ, నమలికొండ చంద్రశేఖర్, రుద్రాంగి గోపాల్ కృష్ణ శర్మ, సముద్రాల వేణుగోపాల చారి శ్రీధర గణపతి శర్మ,, బండపల్లి గోవర్ధన్, జన్మంచి శ్రీనివాస్, బండపల్లి ప్రసాద్ శర్మ, సిరిసిల్ల రాజేందర్ శర్మ, కొలిచాల రవీందర్, బట్టాజి గోపాల్ శర్మ, మేట్ట హరికిరణ్ సిరిసిల్ల భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**



జిజగిత్యాల ల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో, జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎం సంజయ్ కుమార్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతిలో ఫెయిల్ అయినంత మాత్రాన నిరాశ నిస్పృహలకు లోను కావొద్దని, నేను కూడా పదవతరగతి పరీక్షలో రెండు సబ్జెక్టులు తప్పానని, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో, ఆత్మవిశ్వాసంతో మళ్లీ పాస్ అయి, ఈ రోజు జనాలు అందరూ మెచ్చే వైద్యుడిగా, శాసనసభ్యుడిగా మీ ముందున్నానని తెలుపుతూ, పిల్లలందరూ ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయా సబ్జెక్టులో ఉన్న మెళకువలు నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో పదవ తరగతి పరీక్షలు రాసి పాస్ అయి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాము గారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇట్టి శిక్షణా కార్యక్రమం పదవతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పిల్లలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల విద్యాధికారి చంద్రకళ, జగిత్యాల గ్రామీణ మండల విద్యాధికారి గంగాధర్, ధరూర్ క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ లో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

**కరీంనగర్ కల్చరల్,ప్రభాతవార్త:**

ఆంజనేయుడిని కొలిచిన వారికి సకల శుభాలు కలుగుతాయని,పనులలో ఆటంకాలు తొలగిపోతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తపల్లి అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్నటువంటి హనుమాన్ ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి,అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయుడు చాలా గొప్ప గురుభక్తి గలవాడని, కొలిచిన వారికి అన్ని విధాలుగా లాభాలు చేకూరుతాయని చెప్పారు.శ్రీరాముని మార్గాన్ని అనుసరిస్తూ ఎటువంటి నిర్లక్ష్యం, ఆలస్యం లేకుండా చెప్పిన విధానాన్ని అమలుపర్చి తన కార్యాలను అమలుపరిచి సత్ఫలితాలు పొందాడని తెలిపారు.హనుమాన్ జయంతి ప్రతి ఒక్కరూ



ఉపవాసాన్ని పాటిస్తూ హనుమాన్ చాలీసాను పఠిస్తారని నేటికీ భారతదేశంలో హనుమాన్ జయంతిని పండుగగా నిర్వహించడం జరుగుతుందన్నారు..ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యాసంస్థల సిబ్బంది,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# సోలార్ తో సొమ్ము ఆదా

### మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి పచ్చునూరులో వీవో భవన నిర్మాణానికి భూమి పూజ

**మానకొండూర్, ప్రభాతవార్త:**



సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా ప్రజలు సొమ్ములు ఆదా చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని మానకొండూరు ఎమ్మెల్యే, టి పి సి సి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూరు మండలం పచ్చునూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందజేస్తున్న సోలార్ సదుపాయాలపై తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీఎస్ఆర్ఈడీసీఓ) అధికారులతో ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాలపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల వరకు పొందవచ్చున్నారు. ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్కు ఇచ్చి అదనపు ఆదాయాన్ని ప్రజలు పొందవచ్చున్నారు.ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పచ్చునూర్ గ్రామంలో వీవో భవన నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేపట్టారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. భవనం ద్వారా సంఘాలకు అవసరమైన కార్యాచరణ మరింత సులభమై గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్నంది కేశవ్, మండల తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో వివి వరలక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మద్దికుంట సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, కనకం అశోక్, రేమిడి శ్రీనివాసరెడ్డి, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, బండి మల్లేష్, రేమిడి తిరుపతి, సాయిరి దేవయ్య, కొండ సురేష్, కనకం కుమార్, , వేగోళం శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ అనిల్ గౌడ్, ఎంపీఈఓ సతీష్ రావు, వెలుగు జ్యోతి సంఘ అధ్యక్షురాలు పాముల శ్రీలత, కార్యదర్శి ఎలకపల్లి మోనిక, కోశాధికారి జాంతు రాజేశ్వరి, సి ఏ మల్లేష్, మండల విద్యుత్ అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కొడుకు వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ చిగురుమామిడి మండల అధ్యక్షులు మామిడి అంజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలపై అయితే వెంటనే చర్యలు తీసుకునే ప్రభుత్వం, అధికార పార్టీలకు సంబంధించిన వ్యక్తుల విషయంలో మాత్రం మౌనం పాటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.గత మూడు రోజులుగా ఈ అత్యంత తీవ్రమైన పోక్సో కేసుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అన్నారు.మహిళల భద్రత, బాలికల రక్షణ గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు.హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కాబట్టి పెళ్లి చేయండి లేదా సెటిల్మెంట్ చేసుకోండి అని మాట్లాడటం ఒక మంత్రికి తగిన మాటలా అని ప్రశ్నించారు. పోక్సో కేసు అనేది రాజీ చేసుకునే పంచాయితీ విషయం కాదని, ఇది మైనర్ బాలికపై జరిగిన తీవ్రమైన లైంగిక నేరమని స్పష్టం చేశారు.ఒకవైపు మహిళల రక్షణ పేరుతో సభల్లో ప్రసంగాలు చేస్తూ, మరోవైపు అధికార పార్టీలకు చెందిన వారి విషయంలో మాత్రం సెటిల్మెంట్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ అసలు ముఖాన్ని బయటపెడుతోందన్నారు. నిందితుడు సామాన్య కుటుంబానికి చెందినవాడై ఉంటే ఇప్పటికి అరెస్ట్ చేసి మీడియా ముందు పరేడ్ చేసేవారని, కానీ అధికార అహంకారంతో చట్టాన్ని తమ జేబులో పెట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయకుండా నాలుగు రోజుల సమయం ఇవ్వడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ నాయకుల రక్షణ కోసం ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.అసలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందా లేక బీజేపీ ప్రభుత్వం నడుస్తుందా లేక రెండు కలిసి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయా అర్థం కాక ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారు అని అన్నారు.బండి సంజయ్ కొడుకును అరెస్ట్ చేయాలిబండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని, బీజేపీ నుండి బండి సంజయ్ సభ్యత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మామిడి అంజయ్యతో పాటు మండల మాజీ అధ్యక్షులు రామోజు కృష్ణమాచారి, పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి కొమురయ్య గీట్ల తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జి బొట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ వార్త

## మత స్వేచ్ఛను అడ్డుకోకండి

### -దళితుల హక్కులు కాపాడండి

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:**




రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన, మత స్వేచ్ఛను అడ్డుకోవద్దని పద్మశ్రీ డాక్టర్ మందకృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత క్రైస్తవ హక్కుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఇటీవలే సుప్రీంకోర్టు పాస్టర్ ఆనంద విషయంలో ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులు, రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్ 14,15,25 లకు విరుద్ధమని తెలిపారు.ఆ తీర్పును ఖండిస్తున్నామని తెలిపారు.సమాజంలో క్రైస్తవులపై వివక్ష ఇంకా పోలేదని వారికి ఎస్సీ హోదాను కొనసాగించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎమ్ఎఫ్ బి రాష్ట్ర కన్వీనర్ జోజిరెడ్డి,గజ్జల స్వామి,ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాస్టర్స్ అసోసియేషన్ల నాయకులు, పాస్టర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు..

## అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

**కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:**



అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎక్జామినేషన్ లో అల్ఫోర్స్ విద్యార్థులు పుట్టూరి శ్రేయాన్రెడ్డి,గుజ్జుల అశ్రీషడ్డి గంగడి చైత్ర అద్భుత ప్రతిభ కనబరిచి ఐఐఐటి హైద్రాబాద్ లో సీట్లు సాధించడానికి నిర్వహించబడే ఇంటర్వ్యూకి ఎంపిక చేయబడ్డారనిఅల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు.నిరంతరం కృషి చేస్తే ఎలాంటి పోటీ పరీక్షల్లో అయిన విజయం సాధించవచ్చుని విద్యార్థులు నిరూపించారని తెలిపారు.ఇంటర్వ్యూలో కూడ ప్రతిభ కనబరిచి ఐఐఐటి హైద్రాబాద్ లో సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందించారు.

# మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, కారోబార్‌పై ఆరోపణలు అవాస్తవం

### దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సిరిసిల్ల చంద్ర

**మానకొండూర్, ప్రభాతవార్త:** మండలంలోని పచ్చునూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కూరాకుల పోచాలు, గ్రామ కారోబార్ కూరాకుల శ్రీనివాస్ పై గ్రామానికి చెందిన కొందరు అసత్యపు ఆరోపణలు చేయడం అవాస్తవమని దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సిరిసిల్ల చంద్రయ్య అన్నారు. మంగళవారం మానకొండూరు మండల కేంద్రంలో పచ్చునూర్ గ్రామస్తులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల చంద్రయ్య మాట్లాడుతూ.. పలు పత్రికలలో ప్రచురించ బడిన అబద్ధపు వార్తలు నిందారోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామంలోని



ఒక వర్గానికి చెందిన కొందరు గ్రామస్తులు అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 100 రోజుల పనిదినాలలో పోచాలు విధుల్లో లేనప్పటికీ, హాజరుకాని కూలీలను హాజరైనట్లు చూపించి ప్రభుత్వ డబ్బులు దుర్వినియోగం చేశారని చెప్పడం ఎంతవరకు వాస్తవమన్నారు. ఇద్దరిపై వస్తున్న ఆరోపణలపై తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపు శంకర్ రెడ్డి, టీఎం గ్రామ శాఖ అధ్యక్షుడు రామంచ ప్రవీణ్, వార్డు సభ్యుడు పిట్టల మల్లేశం, పార్నంది దేవయ్య, కల్వల రవి, గోపు మహిపాల్ రెడ్డి, పోచాలు, అంతడుపుల మహేష్, పాల్గొన్నారు.

# మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి, భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగుబాటు..?

**45ఏళ్ల అజ్ఞాత జీవితానికి తెర..**
**పోలీసుల వ్యూహం ఫలించింది..**



**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితమే మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ప్రభుత్వాలకు మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టి వారికి ఉపాది మార్గాలు అన్వేషించి, జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించాలని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ 1, 2కు ముందే రాష్ట్రాలకు అధేశాలు జారీ చేయడంతో తెలంగాణ రాష్ట్రం మావోయిస్టుల లొంగుబాట్లకు అటు రాజకీయ పరంగా, ఇటు అధికార పరంగా.. ఇటు మద్యవర్తుల పరంగా అనేక కోణాలలో మావోయిస్టుల లొంగుబాటుకు రెడ్ కార్పేట్ పరవడంతో సంవత్సర కాలంలో తెలంగాణ ప్రభుత్వం ఆశించిన సంఖ్య కంటే మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులతో పాటు చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మద్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలతో పాటు దళసభ్యుల వరకు తెలంగాణ ప్రభుత్వం ఇటు పోలీస్ యంత్రాంగం సేఫ్ జోన్‌గా భావించిన మావోయిస్టులు అధిక సంఖ్యలో తెలంగాణ ప్రభుత్వం, పోలీసుల ముందు లొంగిపోయి దేశంలోనే సంచలనం సృష్టించారు. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చి 31, 2026 నాటికి గడువు విధించిన దండకారణ్యంలో అనేక అనారోగ్య కారణాలతో అక్కడక్కడ మిగిలిపోయిన మావోయిస్టు నేతలు గడువు ముగిసినప్పటికి ఒక్కరొక్కరుగా వచ్చి లొంగిపోతున్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం నుండి హన్మకొండ జిల్లా ఖాజీపూట మండలం సోమిడి గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి, అలియాస్ సంతోష్ మంగళవారం తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారుల ముందు లొంగిపోయారు..? ఆయనతో పాటు ఆయన సతీమణి ఇరువురు సరెండర్ అయినట్లు సమాచారం. గత 45 సంవత్సరాల పాటు మావోయిస్టు ఉద్యమంలో పలు రాష్ట్రాల పరిధిలో అంచలంచెలుగా ఎదిగి అనేక కీలకమైన బాధ్యతు నిర్వర్తించి, కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఆ స్తాయి వ్యక్తి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ అని వాపోతున్నారు. 1996లో అప్పటి రాడికల్ స్టూడెంట్ యూనియన్ ద్వారా అజ్ఞాతంలోకి వెళ్లిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్ నాలుగు దశాబ్దాల పై చిలుకు మావోయిస్టు పార్టీలో పలు హోదాలలో కొనసాగారు. చత్తీస్‌ఘడ్ లాంటి రాష్ట్రంలో మెలిటరీ ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషించిన నరహరి ఇటీవల కేంద్రకమిటీ సభ్యునిగా పదోన్నతి పొందారు. ముఖ్యంగా జార్ఖండ్ రాష్ట్రంలోని ఈస్ట్ రీజినల్ బ్యూరో టెక్నికల్ విభాగంలో అత్యంత కీలక బాధ్యతలు నరహరి నిర్వహించారు. ఇటీవల జార్ఖండ్‌లో పోలిట్ బ్యూరో సభ్యుడు మావోయిస్టులలో చురుకఐన అగ్రనాయకుడు మిస్రిబిస్రా కోసం భద్రత బలగాలు గత రెండు నెలలుగా విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడంతో ఆ క్రమంలో తప్పించుకునే పరిస్థితులో దండకారణ్యంలో లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నరహరి ఆయన సతీమణి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తుంది. 2026 మార్చి 31నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రత బలగాలు దేశవ్యాప్తంగా మావోయిస్టులపై ఆపరేషన్‌లు ముమ్మరం చేసాయి. ఇప్పటికే గణపతి, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ వంటి పలువురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోగా, తాజాగా నరహరి సరెండర్ మావోయిస్టు పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా ప్రజాసంఘాలు భావిస్తున్నాయి. దాదాపు 45ఏళ్ల అజ్ఞాత జీవితం గడిపిన నరహరి మావోయిస్టు ఉద్యమంలో కీలకనాయకుడిగా ఎదిగారు. తెలంగాణకు చెందిన వ్యక్తి కావడం కేంద్ర కమిటీలో కీలకస్థానం పొందడం ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు భద్రత వర్గాలు పేర్కొంటున్నాయి. నరహరి దంపతుల లొంగుబాటుతో జార్ఖండ్ రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు వాపోతున్నారు.

అసలే ఎండకాలం.. అందులో మావోయిస్టు పార్టీకి ఈ నాలుగు మాసాలు వారి పరిభాషలో కరువుకాలం. దండకారణ్యంలో పచ్చటి చెట్లు ఎండిపోయి ఆకులు రాల్చడంతో నిల్వడానికి నీడలేక.. తాగడానికి అందుబాటులో మంచినీరు లేక అనేక ఇక్కట్లకు లోనై షెల్టర్‌జోన్‌లు కరువై.. శత్రువులకు కంటపడే కాలం కావడంతో మావోయిస్టు నక్సల్స్ నిత్యం దండకారణ్యంలో వర్షాలు పడి ఆకులు చిగురించే వరకు మన దళంలో.. మన ప్లాటూన్‌లో ఎప్పుడు ఏం జరుగుద్దో.. మళ్లి వచ్చే ఏటినాటికి ఎవరు ఉంటారో..? ఎవరు పోతారో..? అనుకుంటూ మావోయిస్టులు నాలుగు మాసాల పాటు స్మరించే ఈ కరువుకాలంలో పోలీసులు పడుతున్న గాలింపులతో ఇంక ఎంతమంది లొంగిపోనున్నారో... వేచి చూడాల్సిందే.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 70ఎకరాలలో మక్క జొన్న పంట దగ్ధం

**ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి**



**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మక్కజొన్న చేతికి వచ్చిన పంట దురదృష్టవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పంటుకోవడంతో సుమారు 70 ఎకరాలలో పండించిన మక్కజొన్న పంట పూర్తి కాలి బూడిదైన సంఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాల, వంతడుపుల గ్రామాన మధ్యన జరిగింది. పూర్తి వివరాల్లోకి మక్కజొన్న పంట నష్టపోయిన రైతులను మంగళవారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పలువురు రైతు సంఘం నాయకులు కాలిపోయిన పంట పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉన్నతాధికారులతో విచారణ జరిపించి, నష్టపోయిన రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేసారు. గోపాల్‌పూర్, వంతడుపుల గ్రామాలకు చెందిన రైతులు కంటనీరు పెడుతూ వారికి జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. కాలిబూడిదైన మక్కజొన్న కంకిరాసులను చూపించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, అధైర్యపడవద్దని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులతో తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎకరాకు లక్ష రూపాయల చొప్పున పంట నష్టం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేసారు. హుజురాబాద్ నియోజకవర్గంలో మక్కల కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. జమ్మికుంట, హుజురాబాద్, కమలాపూర్ మార్కెట్ యార్డుల్లో మక్కలు కొనుగోలు చేయడానికి అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని క్వింటాల్‌కు 41కిలోలకు బదులు, 43-45 కిలోల వరకు తూకం వేస్తూ.. రైతులను దోచుకుంటున్నారని ఎమ్మెల్యే తీవ్రంగా ఆరోపించారు. గన్నీ సంచిల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగున రైతులను మోసం చేస్తుందన్నారు. రైతుబంధు జమచేయడంలో జాప్యం, కరెంట్ కోతలతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కరీంనగర్ కెడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వర్‌రావు, పొనగంటి రామూర్తిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:** మంగళవారం పట్టణానికి చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు హుజురాబాద్ మండలంలోని అంబేద్కర్ నగర్, గ్రామ పంచాయతీ పరిధిలో, కాకతీయ కెనాల్ పిల్ల కాలువలో పేరుకపోయినా మట్టిని తొలగించుటకు పని చేస్తున్న 70 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) రెంటాల బుచ్చయ్య మానవ వికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా అందించారు. వేసవిలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఎండ నుండి ఉపశమనం పొందుటకు మధురమ్మ ట్రస్ట్ వారు మజ్జిగ ప్యాకెట్లు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలందరూ పాల్గొన్నారు.

# హుజూరాబాద్ వార్త



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు వేముగంటి భార్గవ శర్మ అర్చకులు చందర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీగణపతి శ్రీసుబ్రహ్మణ్య స్వామి శ్రీ భక్తాంజనేయ స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి, విశిష్ట అలంకరణ చేసి భక్తులకు శ్రీ భక్తాంజనేయ స్వామి దివ్య దర్శనం కల్పించారు. హనుమాన్ జయంతి సందర్భంగా సాయి బాలాజీ సూపర్ మార్కెట్ వారు దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. గర్రెపల్లి లక్ష్మీనారాయణ జ్యోతి దంపతులు పులిహోర ప్రసాదాన్ని జమ్మికుంట వాసవి క్లబ్ సభ్యులు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అరటిపండ్లు పులిహోర పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ప్రమాదకరంగా మారిన మర్రిపల్లిగూడెం గుండేడు ఆర్ అండ్ బి రోడ్డు

**పట్టించుకోని పాలకులు, పర్యవేక్షణ లేని అధికారులు**



**కమలాపూర్: ప్రభాతవార్త.** కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం నుంచి గుండేడు వరకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా విచ్చలవిడిగా పెరిగిన చెట్లు, పొదలతో వాహనదారుల ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు ఒకవైపు ఎస్సారెస్పీ కెనాల్, మరోవైపు దట్టంగా పెరిగిన తుమ్మచెట్లతో ఆనుకొని ఉండటంతో రాకపోకలు సాగించే వారికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. కొద్దిగా పక్కకు తిరిగితే కెనాల్ లోకి పడే ప్రమాదం ఉండటంతో వాహనాల వేగం మందగిస్తోంది. మర్రిపల్లిగూడెం, గుండేడు, లక్ష్మాజిపల్లి గ్రామాలను కలిపే ప్రధాన రహదారి ఇదే కావడం గమనార్హం. రోజు వందలాది మంది విద్యార్థులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ రోడ్డు నిర్వహణ, మరమ్మత్తుల విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులకు కూడా ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని మండిపడుతున్నారు. "ఏదైనా పెను ప్రమాదం జరిగితే కానీ మీకు కళ్లు తెరుచుకోవా? ప్రజల ప్రాణాలు అంత చవకా?" అంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లు, పొదలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా సీబీఎస్ఈ విధానం

### సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ కు సీబీఎస్ఈ అనుమతి

### పోటీ పరీక్షలకు సీబీఎస్ఈ విధానం ఉపయోగకరం

### అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026-27 విద్యా సంవత్సరానికి సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి లభించినట్లు వెల్లడించారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలకు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ విధానం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో విద్య అందించనున్నట్లు తెలిపారు. 60 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ విధానంలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు.సీబీఎస్ఈ విధానంలో పుస్తక జ్ఞానంతో పాటు విద్యార్థుల ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక సామర్థ్యాలకు



ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. పరీక్షల్లో సగం ప్రశ్నలు పాఠ్యాంశాల నుంచి, మిగతా సగం విద్యార్థుల సొంత అవగాహన ఆధారంగా ఉంటాయని తెలిపారు. ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.కరీంనగర్ కొత్తపల్లి, వర్ధన్నపేట ప్రాంతాల్లో ఇప్పటికే సీబీఎస్ఈ విధానం కొనసాగుతోందని, ఇప్పుడు సుల్తానాబాద్‌లో కూడా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అల్ఫోర్స్ విద్యాలయం స్థాపించి 14 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఇటీవల పెద్దపల్లి జిల్లాలో 589 మార్కులతో తమ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు.సీబీఎస్ఈ అనుమతి లభించిన సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సత్యం,ఉపాధ్యాయులు డాక్టర్ నరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దపల్లి వార్త



## 21వ డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి

### పారిశుద్ధ్య సమస్యలపై కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

**గోదావరిఖని, ప్రభాతవార్త:**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌ను పారిశుద్ధ్య నిర్వహణ దృష్ట్యా ప్రత్యేక డివిజన్‌గా గుర్తించాలని ఆ డివిజన్ కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె వినతిపత్రం సమర్పించారు.డివిజన్ పరిధి విస్తీర్ణం అధికంగా ఉండటంతో పాటు జనాభా కూడా వేగంగా పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. మూడు ప్రాంతాల కలయికతో ఏర్పడిన 21వ డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న పారిశుద్ధ్య సిబ్బంది సరిపోవడం లేదని తెలిపారు. ఫలితంగా చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని వివరించారు.ప్రత్యేకంగా ఎల్కలపల్లి గేట్, లక్ష్మీపురం ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారిందని, వర్షాలు పడిన సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించడంతో పాటు జేసీబీ, ఫాగింగ్ యంత్రాలను కేటాయించాలని కోరారు.డివిజన్‌ను ప్రత్యేక పారిశుద్ధ్య విభాగంగా గుర్తిస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించే అవకాశం ఉంటుందని కార్పొరేటర్ అభిప్రాయపడ్డారు.

## జూలపల్లి పంచాయతీ కార్యదర్శిపై డీఎల్పీఓ విచారణ

### అక్రమ కట్టడాల అంశం పై కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేసిన డీఎల్పీఓ దేవకిదేవి

**జూలపల్లి,ప్రభాతవార్త:**



దేవకిదేవి ఆధ్వర్యంలో జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి అనంతుల లచ్చయ్య పై వచ్చిన ఫిర్యాదు పై విచారణ నిర్వహించారు.ఈ విచారణకు గ్రామ ఉపసర్పంచ్ కొప్పుల మహేష్ హాజరై తన వాదనలు వినిపించారు.ఉపసర్పంచ్ కొప్పుల మహేష్ తెలిపిన వివరాల ప్రకారం,28022026న జిల్లా కలెక్టర్‌కు గ్రామపంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గత 20 సంవత్సరాలుగా మండలంలోనే విధులు నిర్వహిస్తూ,అందులోనూ సుమారు 13-14 సంవత్సరాలుగా జూలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్న అనంతుల లచ్చయ్య అక్రమ కట్టడాలకు ప్రోత్సాహం కల్పిస్తున్నారని ఆరోపించారు.ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, రోడ్లపైకి వచ్చిన నిర్మాణాలను కూడా నియంత్రించలేదని పేర్కొన్నారు.అలాగే గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉండాల్సిన కార్యదర్శి కరీంనగర్ లో నివసిస్తూ అక్కడి నుంచి విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు.విచారణ సందర్భంగా డీఎల్పీఓ దేవకిదేవి పలు ఫిర్యాదు స్థలాలను పరిశీలించి అక్రమ కట్టడాలపై కార్యదర్శిని ప్రశ్నించి. రోడ్లపైకి వచ్చిన నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారు? పనులను ఎందుకు నిలిపివేయలేదు? చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు? అంటూ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఉప సర్పంచ్ కొప్పుల మహేష్ తెలిపారు.అక్రమ కట్టడాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్పీఓను కోరారు.ఈ విచారణలో సర్పంచ్ పాతకుల అనూష,ఎంపిఓ శేషయ్య సూరి,మామిడిశెట్టి శ్రీనివాస్,ఎండి.అంకుస్,పాతకుల జ్యోత్స్న,మల్లెత్తుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సీ విద్యార్థులకు రెమెడియల్ క్యాంపులు

### పి.ఎం. శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల ప్రారంభం

**గోదావరి ఖని, ప్రభాత వార్త:**
పదో తరగతి ఫలితాల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధించేలా జిల్లాలోని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక రెమెడియల్ క్యాంపులను ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'ఎడ్యుకేషన్ వీక్' రెండో రోజు కార్యక్రమాల్లో ఈ క్యాంపులను ప్రారంభించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.రామగుండంలోని పి.ఎం. శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సప్లిమెంటరీ పరీక్షలను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో రామగుండంస్థానిక కార్పొరేటర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆకాంక్షించారు.

## టీ దుకాణాల్లో స్మోకింగ్ జోన్లపై పోలీసుల దాడులు

### ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

### ఎస్ఐ చంద్రకుమార్ హెచ్చరిక

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**



టీ షాపుల్లో సిగరెట్లు తాగేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్మోకింగ్ జోన్లను వెంటనే ఎత్తివేయాలని సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ టీ దుకాణాల యజమానులకు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు టీ స్టాళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్మోకింగ్ రూమ్‌ల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత సిగరెట్, మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసలవుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీ షాపుల్లో ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సిగరెట్లు తాగేందుకు అవకాశం కల్పించడం వల్ల యువత చెడు మార్గాలకు దారి తీసే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఇటువంటి స్మోకింగ్ రూమ్‌లను వెంటనే తొలగించాలని సూచించారు.ఇకపై తరచూ దాడులు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించి ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సిగరెట్లు విక్రయించినా లేదా వినియోగానికి అవకాశం కల్పించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం అక్కడ సిగరెట్లు పీలుస్తున్న యువతకు కౌన్సెలింగ్ నిర్వహించి, చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు.ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు పెరగాలి

### -జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.ప్రమోద్ కుమార్

### -ఆశ నోడల్ సూపర్ వైజర్లతో సమీక్ష నిర్వహణ

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు పెరగాలనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలోని ఆశ నోడల్ సూపర్ వైజర్లకు సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను పెంచాలని అందుకు ఆశలు ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గర్భిణి స్త్రీలను ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయాలని, గర్భిణులు పరీక్షలకు జిల్లా ఆసుపత్రి పెద్దపల్లికి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, ఇతర కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించినప్పుడు ఆశలు, ఏఎనఎంలు కూడా వెళ్లాలని ఆదేశించారు. 102 వాహన సేవలు వినియోగించుకోవాలని, బర్త్ ప్లాన్ ప్రకారం అదే ఫెసిలిటీలో డెలివరీ అయ్యేలా చూడాలని సూచించారు. పిసివి వాక్సినేషన్ను సంబంధిత కేంద్రాలలో టార్గెట్ ప్రకారం వేయించాలని, ఎన్సిడి స్క్రీనింగ్ గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. టిబి ప్రోగ్రామ్లో నిక్షయ్ శివిర్ ఫేజ్ 2 లో అనుమానిత లక్షణాలు ఉన్నవారిని, వల్నరబుల్ జనాభాను టిబి స్క్రీనింగ్ తేమడ పరీక్ష, ఎక్స్ రే పరీక్షల ద్వారా నిర్వహించాలని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బ నివారణ చర్యలు తీసుకోవాలని, ఓఆరఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలని, దీనిపై ఆశలు అవగాహన కల్పించేలా చూడాలని ఆశ నోడల్ సూపర్ వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు రాజమోళి, బి.శ్రీరాములు, వి.వాణిశ్రీ, కె వి.సుధాకర్ రెడ్డి, బి.కిరణ్ కుమార్, జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్ దయామని పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుకలు

### ధూపదీప నైవేద్యాలకు సహకరించిన దంపతులకు సన్మానం

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:**
మండలంలోని హనుమండ్లపల్లి గ్రామంలోని అతి పురాతన శ్రీ పిల్లిగుండ్ల హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మాజీ ఎంపీటీసీ పురం ప్రేమ్‌చందర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ చొప్పరి శైలజ, అంజయ్య దంపతులు కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో ధూపదీప నైవేద్యాలకు సహకరిస్తున్న దంపతులను ఘనంగా సన్మానించారు. పూసలకు చెందిన చొప్పరి కనకయ్య దంపతులు, కందునూరిపల్లెకు చెందిన మెండే శంకరయ్య దంపతులు దేవాలయ నిర్వహణకు విశేష సహకారం అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. వారి సేవలను కొనియాడుతూ వేద పండితుల ఆశీర్వాదాల మధ్య సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు, నిర్వాహకులు, పురం వినోద్, ప్రేమ్‌చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి వార్త

# రుక్మాపూర్ లో రైతుల రాస్తారోకో

**ఎమ్మెల్యే ఆదేశాలిచ్చినా...**
**పట్టింపులు లేని తహసిల్దార్**
**సెంటర్ల వద్ద అందుబాటులో లేని**
**ఇంచార్జి అధికారులు**

చొప్పదండి,ప్రభాతవార్త:



ప్రభుత్వం ఎన్ని హామీలు ఇస్తున్నప్పటికీ మిల్లర్లు మళ్ళీ 43 కేజీల తూకం వేస్తూ తరుగు తీస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం చొప్పదండి మండలం రుక్మాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై రుక్మాపూర్ గ్రామ రైతులు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన రైతులు 200 మందికి పైగా రాష్ట్ర రహదారిపై గంటసేపు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మరి ధాన్యం కొనుగోలులో జరుగు దోపిడీ నివారించాలని నిరసన తెలియజేశారు. స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఈ విద్యార్థులకు పోటీ పరీక్షలు ఉన్నందున వాహనాలను వెళ్ళని ఇవ్వాలని రైతులను అభ్యర్థించి నచ్చ చెప్పి వాహనాలను పునః ప్రారంభింపజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాలు ఇచ్చిన తహసిల్దార్ కానీ సంబంధిత అధికారులు కానీ పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆరోపించారు. ఇంచార్జి గా ఉన్న అధికారుల జాడే సెంటర్ల వద్ద కనిపించటం లేదంటూ రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దొంతి సారయ్య సంపత్ మాట్లాడుతూ మిల్లర్లు వినకుండా 43 కేజీలు తూకం వేస్తేనే ధాన్యం తీసుకుంటామని లేకుంటే తీసుకోమని తెగేసి చెబుతున్నారని, సదరు రైస్ మిల్లర్ల పై వెంటనే చర్య తీసుకుని తరుగుదోపిడిని అరికట్టాలని కోరారు. అదేవిధంగా నాణ్యమైన వడ్లను ఏ కేటగిరీలో కాకుండా బి కేటగిరీలో కొనుగోలు చేస్తూ క్వింటాలుకు 20 రూపాయలు తక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ, ప్రభుత్వ అధికారులు ప్రశ్నించడం లేదని, వడ్లను ఏ కేటగిరి లోన్ కొనుగోలు చేయాలని, తరుగుదోపిడి నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం ప్రజా ప్రతినిధులకు అభివృద్ధి పథకాలపై అవగాహన

చొప్పదండి,ప్రభాతవార్త:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరగనున్నందున, మూడవరోజు ఆయన గురువారం నియోజకవర్గస్థాయి చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలకు చెందిన సర్పంచులకు, మునిసిపల్ కౌన్సిలర్లకు విద్యా సంబంధిత అభివృద్ధి పథకాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని మండల విద్యాధికారి జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఈ కార్యక్రమం చొప్పదండి నియోజకవర్గం లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఏ సి ఎల్ బి అధికారిని, మండల అధికారులందరూ హాజరవుతున్నందున తప్పనిసరి ఈ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కోరారు.

## త్వరతగతిన కొనుగోళ్ళు చేపట్టండి

చొప్పదండి,ప్రభాతవార్త:



రైతులు ఆరుగాలం కష్టపడి పాండించిన పంటను త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టి రైతుల ఇబ్బందులను తక్షణమే తొలగించండి అని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి లో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రైతులు కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పైగా అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతుల ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేసి కొనుగోళ్ల చేపట్టినట్లయితే రైతులు నష్ట పోకుండా ఉంటారని, అందుకే అధికారులు చొరవ చూపి రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోళ్ల చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని కృష్ణారెడ్డి కోరారు.

# మహిళా భద్రతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**తక్షణమే బండి భగీరథ్ ను**
**అరెస్ట్ చెయ్యాలి**
**నైతిక బాధ్యతగా బండి సంజయ్**
**రాజీనామా చెయ్యాలి.**
**బీఆర్ఎస్ మహిళా నేత, మున్సిపల్**
**మాజీ ఛైర్ పర్సన్ తాటిపర్తి**
**విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి.**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



మహిళల భద్రత, అత్యాచారాల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని బీఆర్ఎస్ మహిళా నేత, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి ఆరోపించారు... జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై అత్యాచారం ఆరోపణలు వస్తుంటే, పోలీస్ శాఖ విచారణ చేపట్టి, కేసులు నమోదు చెయ్యకపోవడం అత్యంత విచారకరం అన్నారు. అటు దేశంలో బిజెపి, రాష్ట్రం లో కాంగ్రెస్ పాలనలో మహిళల రక్షణ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అత్యాచారాలు, హత్యాల నివారణ చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, హోమ్ శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి విఫలం అయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మహిళలతో పాటుగా, విదేశీ మహిళపై కూడా అత్యాచారం జరిగిన ఉదంతాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలు సురక్షితంగా బతికే హక్కు కోల్పోయిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అసమర్థత పాలనే రాష్ట్రంలో మహిళలపై హింస పెరగడానికి కారణం అని భావిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడం కాదు, ముందు వారి మాన, ప్రాణాలు కాపాడెందుకు పటిష్ట రక్షణ వ్యవస్థ, చట్టాల కఠిన అమలుపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో మహిళలపై ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. హైదరాబాద్ నగరంలో ఓ మహిళా పోలీస్ అధికారిని అండర్ కవర్ ఆపరేషన్ లో భాగంగా అర్ధరాత్రి మాఫ్టీలో వెళ్ళి రోడ్డుపై నిలబడితే, 40 మంది పోకిరిలు ఆమెను వేధించడానికి ప్రయత్నించి, అసభ్యంగా ప్రవర్తించిన తీరును చూసైనా సామాన్య మహిళల పరిస్థితి ఎంటో రాష్ట్ర ప్రభుత్వం అంచనా వెయ్యకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం కు నిదర్శనం అన్నారు. ఇక బిజెపి పాలనలో సాక్షాత్తు కేంద్ర మంత్రులు ఎమ్మెల్యే లే మహిళలపై అసభ్యకరంగా మాట్లాడ్డం చూస్తూనే ఉన్నామని, ఉత్తర భారతదేశంలో అత్యాచారాలను అదుపు చెయ్యడంలో కేంద్ర ప్రభుత్వం, మోదీ అమిత్ షా విఫలం అయ్యారని ఆరోపించారు. బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదల వంటి అంశాల్లో బిజెపి వైఖరి స్పష్టం అయ్యిందని గుర్తు చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ ను అరెస్ట్ చెయ్యడం లో జాప్యం ఎందుకని విజయలక్ష్మి ప్రశ్నించారు. తక్షణమే భగీరథ్ ని అరెస్ట్ చేసి చట్టప్రకారం శిక్షించాలని, బండి సంజయ్ స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చెయ్యాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్ పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, లక్ష్మీపూర్ సర్పంచ్ కవిత,మాజీ సర్పంచ్ ఎల్ల గంగనర్సు, మాజీ కౌన్సిలర్ శ్రీలత,బీఆర్ఎస్ మహిళా నాయకులు వట్నం అనురాధ, బండపెల్లి మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో చేరండి భవిష్యత్తును నిర్మించుకోండి

**ఇంటర్ విద్య వారోత్సవాల్లో విద్యార్థులకు అవగాహన**
**- అడ్మిషన్ల ప్రచారానికి శ్రీకారం**

కొడిమ్యాల, ప్రభాతవార్త:

కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ విద్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అడ్మిషన్ల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయడం సంతోషకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో మెరుగైన బోధనతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మంగళవారం నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు వెల్లడించారు. అధ్యాపకులు డి. జయశీల, డా. పి తిరుపతి, సిహెచ్ నర్సయ్య, ఎస్.శ్యామ్ కుమార్, డి.శ్రీకాంత్, ఆఫీస్ సిబ్బంది ఎం.డి. బాబూమియా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**సీపీఐ ఎంఎల్ మాస్ లైన్**
**ప్రజాపంథా డిమాండ్**

గోదావరిఖని, ప్రభాతవార్త:

మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలతో నమోదైన పోక్సో కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కేసు నమోదై రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని నాయకులు పేర్కొన్నారు. చట్ట ప్రకారం బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకోవాల్సి ఉండగా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బాధిత బాలికకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించి కేసును పారదర్శకంగా విచారించాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ప్రకటనను జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, తోకల రమేష్ విడుదల చేశారు.

# పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్ చైర్మన్ సమీక్ష సమావేశం

**వేములవాడ టౌన్ ప్రభాతవార్త:**

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మరియు ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక గూడు అనేది పేద కుటుంబానికి ఇచ్చే అతిపెద్ద సామాజిక భరోసా అని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిధులు సకాలంలో అందేలా చూడాలని, నిర్మాణ దశల్లో వారికి



అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తూ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడటమే మన లక్ష్యమని పుల్కం రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ మాలతి, హౌసింగ్ ఏఈ సౌజన్య, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

కాంగ్రెస్, బీజేపీ పార్టీల దోస్తీ తో...

ఫోక్సో నిందితుడుని కాపాడుతుంది కాంగ్రెస్ సర్కార్..

**ప్రభాత వార్త కోనరావుపేట:**

ఫోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే బండి సంజయ్ తన పదవికి రాజీనామాచేయాలనికోనరావుపేట బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సరైన చర్యలు తీసుకోకుండా భగీరథను కాపాడేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మండల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, కొలనూరు ఫ్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తన కుమారుడిని సరైన విధంగా పెంచకుండా ఇప్పుడు అతన్ని శిక్ష నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహిళలపై దాడులు పెరుగుతున్న సమయంలో మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ఈ ఘటనపైస్పందించకపోవడం బాధాకరమన్నారు.



ఫోక్సో కేసు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య దోస్తీ బయటపడుతోందని ఆరోపించారు. బండి భగీరథ దేశం విడిచి పారిపోకుండా వెంటనే లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచిత ప్రవర్తనకు సంబంధించిన అంశాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బొజ్జ మల్లేశం , పార్టీ సీనియర్ నాయకులు మాందాల శ్రీనివాస్, గోపు పరుశ రాములు, సింగం ప్రసాద్, చిట్నేని శివతేజ, రాసరత్నాకర్ , ఉపసర్పంచ్ నవీన్, నాయకులు యాస రాజం శ్రీనివాస్, రామచంద్రం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోతో క్రమశిక్షణ అలవర్చుకోవచ్చు

సర్పంచ్ నాగభూషణం

నాగారంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:**

విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ అలవరచ్చుకోవచ్చని సర్పంచ్ అప్పాల నాగభూషణం సూచించారు. మంగళవారం కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ను సర్పంచ్ సౌజన్యము తో ప్రభుత్వ జడ్పి ఉన్నత పాఠశాలలో ప్రారభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవులను వృధా





చేయకుండా, ఈ లాంటివి శిబిరాలను ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను తల్లి దండ్రులు ప్రోత్సాహం అందించినప్పుడే వారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు ముఖ్యమే అన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ శ్రీనివాస్ ఉన్నారు.

# రైతుల భాదలు పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే పనిలో పడ్డారు

ఒకరు, ఇద్దరు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదు

**రుద్రంగి ప్రభాత వార్త :**

ధాన్యం కొనుగోల్ల జాప్యంపై రుద్రంగి మండలం ఉమ్మడి మనాల గ్రామం లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఉమ్మడిమానాల గ్రామం లో ఇప్పడి వరకి 2 లారీల వరి ధాన్యం మాత్రమే మిల్లు కి పంపించడం జరిగిందని, జిల్లాలో అత్యధికంగా మక్కలు మానాల గ్రామం లో పండిస్తే ఎక్కడ కొనుగోలు కేంద్రం పెట్టకుండా 10 కిలో మీటర్ల దూరంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల రైతులు తీవ్ర ఇబందులు ఎదుర్కొంటున్నరని అన్నారు. మానాల గ్రామం లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు, ప్రజలు పడుతున్న కష్టాలను పట్టించుకోకుండా మాయమాటలు చెప్పి బీఆర్ఎస్ పార్టీ



నాయకులను బలవంతంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పే పనిలో పడ్డారని మండి పడ్డారు. ఈ సమావేశంలో సర్పంచ్ లు శంకర్ గౌడ్, రామదాస్, దేగావత్ తండా సర్పంచ్, మాజీ సర్పంచ్ నరహరి నాయక్ మరియు అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

# పెట్రోల్ పంప్ ల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

**చందుర్తి / ప్రభాతవార్త**

చందుర్తి మండలంలో పెట్రోల్ పంపుల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బండపల్లి మాజీ ఎంపీటీసీ గడ్డం రణధీర్ రెడ్డి జిల్లా అధికారులను కోరారు, చందుర్తి పెట్రోల్ పంప్ ల్లో వాహనాలలో గాలి పెట్టే యంత్రాలను ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వాటిని సమకూర్చాలన్నారు వినియోగదారులకు ఈ సౌకర్యాలను కల్పించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.




# ఫిర్యాదులపై వెంటనే చర్యలు, రౌడీ షీటర్లపై కట్టుదిట్ట నిఘా..

-జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త:**



వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల రికార్డులను పరిశీలించి, దర్యాప్తు ప్రక్రియలో నిర్లక్ష్యం లేకుండా పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, వారి కదలికలను సమీపంగా గమనించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ భద్రతను బలోపేతం చేయాలని సూచించారు. బక్రీద్ పండుగ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాల తనిఖీలు పెంచి, పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలను తరచుగా సందర్శిస్తూ ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రతపై దృష్టి పెట్టి, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సీసీ కెమెరాల అవసరాన్ని ప్రజలకు వివరించి, వ్యాపారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గంజాయి, జూదం వంటి అసాంఘిక చర్యలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య వారోత్సవాల్లో భాగంగా కోనరావుపేటలో బడిబాట

**ప్రభాత వార్త కోనరావుపేట:**

విద్య వారోత్సవాల సందర్భంగా పీఎం శ్రీ ఎంపీపీ ఎస్ కోనరావుపేట పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ముందస్తుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజ్మీర మదన్ లాల్ మాట్లాడుతూ గ్రామంలోని పిల్లలందరినీ ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించబడినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ మస్కూరి కాశీరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నైపుణ్యం కలిగినవారని, ఉన్నత విద్యను అభ్యసించిన వారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భాస్కర్, రాము, వెంకటేశం, సంజీవ్, శృతి పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ రేవతి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు.



# మంత్రి చొరవతో ఇందిరమ్మ ఇళ్ల విద్యుత్ సమస్యల పరిష్కారం

### స్పందించన మంత్రికి అధికారులకు కృతజ్ఞతలు

### మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి

**రామగిరి ప్రభాతవార్త:**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సౌకర్యాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడడం జరిగింది. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన కరెంట్ పోల్స్, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఏడీ వెంకటరమణ, ఏఈ మహేందర్ రెడ్డి, లైన్‌మన్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే త్వరితగతిన ఎస్టిమేట్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా



ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు విద్యుత్ వెలుగులు అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు విద్యుత్ అధికారులకు మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## యోగతో ఆరోగ్య జీవనం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం

**మంథని రూరల్ ప్రభాతవార్త :**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల రెండవ రోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పరశయ్య విద్యార్థులు, అధ్యాపకులకు యోగ సాధన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యవంతమైన జీవన స్థితికి ఉత్తమ సాధనమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి నుంచి వచ్చిన యోగా శరీరానికి ఆరోగ్యాన్ని, మనసుకు ప్రశాంతతను, ఆత్మకు శుద్ధిని అందిస్తుందని తెలిపారు. యోగా ద్వారా శరీర దృఢత్వం, మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయవచ్చని అన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంలో యోగా ఎంతో ఉపయోగకరమని వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి





యోగాసనాలను సాధన చేశారు. తదనంతరం నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పీజీ, బి.ఎడ్, ఐసెట్, లాసెట్ తదితర ప్రవేశ పరీక్షలపై కళాశాల అధ్యాపక బృందం అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండెల మారుతి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, రజిత, శేఖర్, దుర్గం కృష్ణ, బోధనేతర సిబ్బంది రాజు, సురేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్వచర్లలో పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం

### మంథని ఏడి వెంకటరమణ

**రామగిరి ప్రభాతవార్త**



రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని గొల్లపల్లి, మరియు స్మశాన వాటికలో పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంథని ఏడి వెంకటరమణ అన్నారు. కల్వచర్ల గ్రామంలో స్మశాన వాటికలో గత కొన్ని సంవత్సరాలుగా సింగల్ ఫేస్ విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే గొల్లపల్లిలో విద్యుత్ లైన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి దృష్టికి ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. దీంతో మంథని ఏడి వెంకటరమణ, ఏఈ మహేందర్ రెడ్డి, లైన్మెన్ ఆకుల శ్రీనివాస్ గ్రామంలోని గొల్లపల్లి మరియు స్మశాన వాటికను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏడి వెంకటరమణ మాట్లాడుతూ స్మశాన వాటికలో సింగల్ ఫేస్ సౌకర్యం కల్పిస్తామని అలాగే గొల్లపల్లిలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యుత్ అధికారులకు గ్రామ సర్పంచ్ శారద కుమారస్వామి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట నాయకులు బొంకూర్ పోశం, యాట భూమేష్ పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజీ వాటర్‌తో పంటపొలాలకు ముప్పు

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో శైలజ రాణి

**రామగిరి ప్రభాతవార్త:**

సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజ్ వాటర్ తో పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని మంథని ఆర్డిఓ కార్యాలయంలో ఈ నెల 4, తేదీన ప్రజా వాణిలో రైతులు ఫిర్యాదు చేయడం జరిగింది. రాంనగర్, సీటూ క్వార్టర్స్, మరియు పాత లద్నాపూర్ ఫ్లాట్స్, కొత్త ఫ్లాట్స్, డ్రైనేజ్ వాటర్ ను రత్నాపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు వదిలే విధంగా డ్రైనేజీ నిర్మాణానికి సింగరేణి సంస్థ టెండర్ పనులు పిలవడం జరిగింది. దీంతో పై నుండి వచ్చే డ్రైనేజీ వాటర్ తో కింద ఉన్న పంట పొలాలకు ముప్పు వాటిల్లుతుందని ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో మంగళవారం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రైనేజీ వాటర్ ను ఎంపీడీవో బద్రి శైలజ రాణి తో పాటు గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు, గ్రామ కార్యదర్శి సంతోష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజ రాణి మాట్లాడుతూ పై



నుండి వచ్చే సైడ్ డ్రైనేజ్ వాటర్ తో పంట పొలాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పంటపొలాలకు నష్టం వాటిల్లకుండా కొంత మేరకు ఎంతసే పట్ట భూమి సేకరించి పూర్తిస్థాయిలో సింగరేణి సంస్థతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## 12 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;** జగిత్యాల జిల్లాలో 202526 యాసంగి సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు.

ప్రధానాంశాలు:కొనుగోలు కేంద్రాలు: జిల్లా వ్యాప్తంగా రైతుల కోసం 12 ప్రత్యేక మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సేకరణ: ఇప్పటివరకు 6,231 మంది రైతుల నుండి 23,428 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను సేకరించారు. నిల్వ సామర్థ్యం: ధాన్యం నిల్వ కోసం 15 ప్రధాన గోదాములతో పాటు ధర్మపురి, సారంగాపూర్, చెప్యాల మార్కెట్ కమిటీలలో అదనపు స్థలాలను సిద్ధం చేశారు

# మంథని వార్త



## అనారోగ్య బాధితునికి రూ.2లక్షల ఎల్.ఓ.సీ అందజేత

**ముత్తారం, ప్రభాతవార్త:**

ముత్తారం మండల కేంద్రానికి చెందిన తాడవేన శంకర్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశ్రయించారు. శంకర్ వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, రూ. 2లక్షల ఎల్.ఓ.సీని మంత్రి మంజూరు చేయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆసుపత్రి సహాయకులు ఎల్.ఓ.సీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, సి.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా ఎల్.ఓ.సీ కింద రూ. 2లక్షలు మంజూరు చేయించడం పట్ల మంత్రి శ్రీధర్‌బాబుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రౌండ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

### మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్

**మంథని ప్రభాత వార్త :**



మంథని పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ పరిధిలోని కళాశాల మైదానం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని మంథని మునిసిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంథని కళాశాల మైదానంలోని ఓపెన్ జి మ్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ జిమ్ ద్వారా అందరూ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధంగా చూసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా వాకింగ్ చేస్తూ జిమ్ ను ఉపయోగించుకోవాలని అన్నారు. త్వరలోనే కొత్త జిమ్ ను ప్రారంభించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజి, కొమురవెల్లి విజయకుమార్, కేశెట్టి అశోక్, డాక్టర్ మల్లికార్జున్, ఎక్కేటి మల్లారెడ్డి, కాయితోజు సమ్మయ్య, కొండపర్తి దశరథం, పోచం తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇస్తానని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**మంథని రూరల్ ప్రభాత వార్త :**



ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మంథని ఎస్ఐ రమేష్ కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు . మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామానికి చెందిన బండి రాజు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు పెట్టిస్తానని బాధితుల వద్ద నుండి 2019లోనే విడివిడిగా ఒక్కొక్కరి దగ్గర నుండి రూ. రెండు లక్షల చొప్పున సుమారు పది మంది వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు వాపోయారు. డబ్బులు ఇవ్వమని అడిగితే, ఇవ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి తమ పట్ల న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో బాధితులు అనపర్తి రాజబాబు, అనపర్తి స్వప్న, పాగే అరవింద్, పాగే లక్ష్మి పాల్గొన్నారు.

# వడ్డెర కార్పోరేషన్ చైర్మన్‌ను మార్చాలి

తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి తిరుపతి

గొల్లపల్లి, ప్రభాతవార్త :



వడ్డెర కులానికి, వడ్డెర ప్రజలకు ఎటువంటి న్యాయం చేయని గుంజ రేణుకను వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి నుంచి తొలగించి, వడ్డెర కులస్తుల అభ్యున్నతికై నిజాయితీగా పనిచేసే వ్యక్తికి ఆ పదవి అప్పగించాలని తెలంగాణ వడ్డెర సంఘం మరియు చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర కులస్తుల అభివృద్ధి కోసం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, రాష్ట్ర వడ్డెర ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కోసం గత రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణ వడ్డెర సంఘం మరియు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేయడంతో పాటు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహించామని తెలిపారు. అందువల్ల వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవికి తమ సంఘం సూచించిన వ్యక్తినే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో జెడ్పీటీసీగా పనిచేసిన గుంజ రేణుక వడ్డెర ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని, వడ్డెర సమాజ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని వడ్డెరల స్థితిగతులు తెలిసిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించినప్పుడే వడ్డెర సమాజానికి నిజమైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌పై స్పందించకపోతే తెలంగాణలోని 33 జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టేందుకు తెలంగాణ వడ్డెర సంఘం మరియు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాగని మహేష్, గండికోట విజయ్ కుమార్, మార్ల కృష్ణ, తాపల్ల శ్రీహరి, ఈడగొట్టి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి

### మానకొండూర్ ఎంఈఓ రాపెల్లి శ్రీనివాస్

మానకొండూర్, ప్రభాతవార్త :



ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని మానకొండూర్ మండల విద్యాధికారి రాపెల్లి శ్రీనివాస్ మంగళవారం అన్నారు. మానకొండూరు మండల వెల్ది గ్రామా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాపెల్లి శ్రీనివాస్‌ను మండల విద్యాధి కారిగా నియమిస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) సత్యనారాయణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ ప్రభాత వార్తతో మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో నూతన బాధ్యతలు అప్ప గించిన జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తనాజి వాకడే కు, నా నియమకానికి సహకరించిన మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులకు, ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య తో పాటు క్రమశిక్షణ ను, ప్రభుత్వ విద్య పై నమ్మకం కలిగేలా తమ వంతు కృషి చేస్తామని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు.

## ఏసీబీ వలలో గంగాధర ఇంచార్జి సబ్ రిజిస్టర్

### -పెద్దపల్లి జిల్లాలో పనిచేసిన కాలంలో అక్రమాలు

### -నిజామాబాద్ లో అరెస్టు చేసిన అధికారులు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా గంగాధర సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇన్చార్జి సబ్ రిజిస్టర్ గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కిరణ్ నివాసంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని కరీంనగర్ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. గతంలో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా కిరణ్ కుమార్ పనిచేశారు. అదే సమయంలో ఇన్చార్జి సబ్ రిజిస్టర్ గా బాధ్యతలు నిర్వహించిన కిరణ్ కుమార్ పై అనేక ఆరోపణలు వచ్చాయి. డాక్యుమెంట్ రైటర్లు బ్రోకర్ల ద్వారా పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారని వచ్చిన ఫిర్యాదుల మేరకు గత ఏడాది నవంబర్ 14న సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో కిరణ్ కుమార్ ప్రైవేట్ అసిస్టెంట్ రత్నకుమార్ వద్ద లెక్కల్లో చూపని 1,06,500 నగదును స్వాధీనం చేసుకొని అక్రమ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సైతం సేకరించారు. దీనిపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపిన అవినీతి నిరోధక శాఖ అధికారులు కిరణ్ కుమార్ పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారించుకున్నారు. మధ్యవర్తుల ద్వారా యూపీఐ చెల్లింపుల ద్వారా అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిజామాబాద్ కు చేరుకున్న ఏసీబీ అధికారులు కిరణ్ ఇంట్లో ఉన్న సమయంలో అదుపులోకి తీసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం ఎసిబి కోర్టులో హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు.

## సెంటర్ లైటింగ్‌తో పట్టణానికి నూతన కళ

రూ.1.20 కోట్లతో డివైడర్ లైటింగ్ ప్రారంభం

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** సెంటర్ లైటింగ్ ఏర్పాటు ద్వారా సుల్తానాబాద్ పట్టణానికి కొత్త కళ తీసుకొస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి రూ.1.20 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన డివైడర్ సెంటర్ లైటింగ్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుల్తానాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులను ఆధునికీకరించడంతో పాటు పూసల రోడ్డు, శ్రీరాంపూర్ రోడ్డులో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పట్టణ సౌందర్యవృద్ధికి రెండు ప్రాంతాల్లో రూ.50 లక్షలతో ఐలాండ్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే రహదారులను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, కౌన్సిలర్లు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**రామగిరి ప్రభాతవార్త** రామగిరి మండలం లో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పన్నూరు, రత్నాపూర్, కల్వచర్ల, ఆదివారం పేట ,బేగంపేట, నవాబుపేట, బుధవారంపేట, రాజపూర్, సుందిళ్ల, లొంక కేసారం,ముస్త్యల, లద్నాపూర్, చందనాపూర్ గ్రామాలలోని హనుమాన్ ఆలయాలలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు , అభిషేకాలు నిర్వహించగా రామనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. పన్నూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో మంథని సీఐ బోల్లపల్లి రాజు గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ కమిటీ సభ్యులు సిఐ రాజు గౌడ్ కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆదివారం పేట హనుమాన్ ఆలయంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, గ్రామ సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, నాగ పెల్లి సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ధర్మపురి వార్త



## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

క్షేత్రంలో మారుమోగిన శ్రీ రామనామ స్మరణం

ధర్మపురి, ప్రభాతవార్త:





ధర్మపురి క్షేత్రం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకల్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి స్నానాలు ఆచరించిన అనంతరం ధర్మపురి శ్రీ లక్ష్మీ మ్నరసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్నాం జనేయ స్వామి వారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలోని అన్ని ఆలయాలను దర్శించుకున్నారు. దేవాలయంలో అర్చకులు, వేద పండితులు స్వామివారికి మన్య సూక్తంతో అభిషేకం, షోడచోపచార పూజలు, హారతి, మంత్రపుష్పం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు తమ దీక్షలను విరమించారు. వేలాదిమంది హనుమాన్ భక్తులు క్షేత్రానికి తరలి రావడంతో క్షేత్రమంతా శ్రీరామ నామ స్మరణంతో మారు మోగింది. ఉదయం నుండి రాత్రి వరకు హనుమాన్ భక్తుల సందడి కనిపించింది.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యల్ని పరిష్కరించాలి

ధర్మపురి, ప్రభాతవార్త:



వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇట్టి సమస్యను పరిష్కరించాలంటూ బిజెపి నాయకులు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. బిజెపి మండల శాఖ అధ్యక్షులు కుమ్మరి తిరుపతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాటు లేకపోవడంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూస్తున్నారని అన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి, రైతులకు డబ్బులు త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమ్మరి తిరుపతి ,గాజు భాస్కర్, కామెర ప్రభాకర్, సత్యనారాయణ, వెంకటేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## హంగులకే ప్రాధాన్యం.. ప్రజా సమస్యలు గాలికే!

మున్సిపల్ పాలకుల తీరుపై మాజీ కౌన్సిలర్ జయశ్రీ ధ్వజం

**జగిత్యాల టౌన్ ప్రభ వార్త..** జగిత్యాల మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రజా సమస్యలను విస్మరించి, కేవలం కార్యాలయ హంగులకే ప్రాధాన్యత ఇస్తోందని మాజీ కౌన్సిలర్ హనుమాండ్ల జయశ్రీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని పాలకుల విలాసాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమె సోమవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ భవనాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని, పునరుద్ధరణ పనుల పేరిట నిధులను దోచుకుంటున్నారని ఆమె మండిపడ్డారు. రెండు అంతస్తుల ఆధునీకరణ కోసం 10 లక్షలు, చైర్మన్ చాంబర్ కోసం మరో లక్ష రూపాయలు వెచ్చించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

# పర్యాటక హబ్‌గా పెద్దపల్లి నియోజకవర్గం

- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు
- 6 కోట్లతో గౌరి గుండాల జలపాతం

## అభివృద్ధి పనుల ప్రారంభం

పెద్దపల్లి, ప్రభాతవార్త:





పర్యాటక హబ్‌గా పెద్దపల్లి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో 6 కోట్లతో గౌరి గుండాల జలపాతం అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో 43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఒక ప్రముఖ పర్యాటక ప్రదేశం సబ్బితం జలపాతం అని, ఇది గట్టు సింగారం కొండల నుండి ఉద్భవించి వర్షాకాలంలో జులై నుండి నవంబర్ వరకు ఆకట్టుకునేలా ప్రవహిస్తుందని తెలిపారు. స్థానికంగా గౌరీ గుండాలుగా పిలవబడే ఈ జలపాతం దట్టమైన అటవీ ప్రాంతంలో సందర్శకులను ఆకర్షిస్తోందని చెప్పారు. గత పాలకులు ఈ జలపాతాన్ని ఎన్ని సార్లు సందర్శించినా తట్టెడు మట్టి కూడా తీయలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా ఎన్నికై 6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పరుస్తున్నానని వెల్లడించారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్ రా మెటీరియల్ తయారీ అవుతుందని, దీనివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గి పరిశుభ్రత పెరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ చేసి ముడి సరుకులు తయారు చేసి టైల్స్, దారం వంటి వాటికి ఉపయోగిస్తారని వివరించారు. ఈ యూనిట్ మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో పనిచేస్తుందని, దీనికి గ్రామస్థులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, పర్యాటక అధికారులు, మునిసిపల్ చైర్మన్ నుగుల్లా మల్లయ్య, మార్కెట్ చైర్మన్ కూర మల్ల రెడ్డి, కొమ్ము సుజాత, నూనె సరోజన, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లపై నిరక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటాం

**-రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**-జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించిన సిఎం**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





వరి ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిరక్ష ్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దానసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాల్లోని స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి స్థాయి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వరధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా సంబంధిత జిల్లా శాఖ అధికారులు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 3 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలి. రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ లను పర్యవేక్షించాలని అన్నారు. సంబంధిత అధికారులు అందరూ అందుబాటులో ఉంటూ లారీల కొరత ఉన్నచోట ట్రాక్టర్లు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డి ఆర్ డి ఓ రఘువరన్, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, డి పి ఆర్ ఓ పి.నరేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జితేంద్ర ప్రసాద్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జై శ్రీరాం.. జై జై హనుమాన్ నామస్మరణలతో మారుమ్రోగిన గ్రామాలు.. పట్టణాలు..

## కాషాయివనంగా మారిన పల్లెలు, పట్టణాలు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:





భారతదేశంలో అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఆంజనేయస్వామి ఆలయం లేని గ్రామం అంటూ ఉండదు అంటే అతిశయోక్తి కాదు.. అందులో ముఖ్యంగా తెలంగాణ గడ్డపై ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రాలలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, భద్రచలం సీతరామ చంద్రస్వామి ఆలయాలకు మండలకాలంపాటు దీక్షలు స్వీకరించిన ఆంజనేయస్వాములు ఈ రెండు పవిత్రక్షేత్రాలకు విధిగా వెళ్తుంటారు. అందులో భాగంగానే మంగళవారం పరమ పవిత్రమైన హనుమాన్ పెద్ద జయంతి పర్వదినం కావడంతో హుజురాబాద్ డివిజన్ పరిదిలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్, శంకరపట్నం మండలాల పరిధిలో ఆంజనేయాస్వామి ఆలయాలలో ఉదయం తెల్లవారుజామున నుండి స్వామి వారి విగ్రహాలకు పవిత్రమైన.. ప్రత్యేకమైన పంచామృత అభిషేకాలు నిర్వహించి, జై శ్రీరాం.. జై జై హనుమాన్ అంటూ గ్రామాగ్రామాన భక్తులు ఆలయాలకు పోటెత్తి కన్నుల పండుగగా భక్తిశ్రద్దలతో నిర్వహించారు. హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఉన్న భక్తాంజనేయాస్వామి ఆలయంలో అర్చకులు ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మాలలు దరించిన వందలాది మంది స్వాములు అధిక సంఖ్యలో హజరైయ్యారు. హుజురాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట వద్ద గల శ్రీపాటిమీది ఆంజనేయాస్వామి ఆలయంలో హుజురాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ గందె రాధిక శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అర్చకులు దేదివ్యమానంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సముద్రాల ప్రసాదాచార్యులు, సముద్రాల కిషోరాచార్యుల ఆధ్వర్యంలో అశేశంగా తరలివచ్చిన భక్తుల మధ్యన పవిత్ర, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి వీదిలో ఉన్న వంద సంవత్సరాల నాటి పురాతన శ్రీ ఆభయాంజనేయాస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు డింగరి హరికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పవిత్ర పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందే ఆలయంలో పవిత్ర హోమాలు నిర్వహించగా, అశేశంగా తరలివచ్చిన దీక్షలు తీసుకున్న ఆంజనేయస్వాములు భక్తిగీతాలు ఆలపించారు. పట్టణంలోని వందలాది మంది భక్తులు తరలివచ్చారు. కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ బొద్దుల రవీందర్, ఆలయ ప్రదాన అర్చకులు వేముగంటి భార్గవ్‌శర్మ, చందర్‌రావుల ఆద్వర్యంలో భక్తాంజనేయాస్వామి మూల విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో విశేశంగా పూజలు నిర్వహించగా, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), మున్సిపల్ కమీషనర్ గుట్టల మల్లిఖార్జునస్వామి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లందకుంట అపరభద్రాద్రి సీతరామాచంద్రస్వామి ఆలయంలో రామభక్త శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ పూజరులు వందలాదిగా దీక్షలు ధరించిన ఆంజనేయస్వాముల మధ్య పూజలు నిర్వహించారు. ఎక్కడ చూసిన ఆంజనేయస్వామి ఆలయాలను సప్తవర్ణాల పుస్పాలతో దేదివ్యమానంగా అలంకరించారు. మద్యాహ్నం ఆలయాల వద్ద మహాఅన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

## ఎన్యూమరేటర్లకు ఇచ్చిన ఏరియా పూర్తి చేయాలి...

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట ప్రుజూరాబాద్, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న జనాభా నమోదు ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటిని సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 202627 జనాభా నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల ఎన్యూమరేట్లు మీ ఇంటికి వచ్చి జనాభా గణన నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటికి వెళ్లి సెన్సెస్ వివరాలలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని నింపి, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారని, ఈ సర్వే పూర్తి కావడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రనిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టిపివో శ్రీధర్, టిపిబివో దీపిక, ఎన్యూమరేటర్లు పలువురు పాల్గొన్నారు.

## ఏబీ స్విచ్‌లతో విద్యుత్ అంతరాయాలకు చెక్

**ఎస్ఈ బి.బిక్షపతి.**

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త.** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ములుగు సర్కిల్‌లో విద్యుత్ వ్యవస్థ బలోపేత పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 124 సింగిల్ ఫేజ్ ఏబీ స్విచ్‌లు, 160 త్రీఫేజ్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటి వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతానికే సరఫరా నిలిపివేసి, మిగతా ప్రాంతాలకు నిరాటంకంగా విద్యుత్ అందించవచ్చని పేర్కొన్నారు.చెట్ల కొమ్మలు తగలడం, భారీ వర్షాలు, ఈదురు గాలులతో ఏర్పడే ఫాల్ట్‌లను త్వరగా గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు ఏబీ స్విచ్‌లు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. దీంతో ట్రిప్పింగ్ సమస్యలు తగ్గడంతో పాటు విద్యుత్ నాణ్యత మెరుగు పడుతోందన్నారు. మరమ్మతుల సమయంలో సిబ్బంది భద్రత పెరగడంతో పాటు విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతోందని వివరించారు. అత్యవసర విద్యుత్ ఫిర్యాదుల కోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని సూచించారు.

## అకాల వర్షం: అన్నదాతలు ఆగం

**తడిసిన ధాన్యరాశులు, ఆగమైన అన్నదాతలు**

**గోవిందరావుపేట, ప్రభాతవార్త** గోవిందరావుపేట మండలంలో మంగళ వారం రాత్రి సమయం 9:10 నిమిషాలకు కురిసిన అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మండలాన్ని అతలాకుతలం చేసింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యరాశులు ఎక్కడికక్కడ నిలిచిపోయి. వర్షార్పణ మయ్యాయి. టార్పాలిన్లు కప్పినా కింద నుంచి చేరిన వర్షపు నీరు ధాన్యాన్ని పూర్తిగా తడిపేసింది.రైతులు కళ్ల ముందే పంట ధాన్యరాశులు కన్నీరుమున్నీరయ్యారు.కాంటాలు ఆలస్యం కావడంతో గత వారం రోజులుగా కేంద్రాల నిండా ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. వాన పడుతుందని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మామిడి తోటల్లో ఈదురుగాలుల ధాటికి కాయలు నేలరాలి మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.పలు గ్రామాల్లో ఇళ్లపై రేకుల పైకప్పులు ఎగిరిపోయి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ధాన్యం తేమశాతం పెరిగితే కొనుగోలుకు ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షం పదేపదే పడుతుండడంతో రైతాంగం భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంది. వెంటనే మండలంలో ఉన్న అధికారులు స్పందించి బాసటగా నిలవాలని రైతులు కోరుకుంటున్నారు.

# హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో సందడి

**-- నర్సుల దినోత్సవం, అధికారుల తనిఖీ, ఫైర్ సేఫ్టీ అవగాహన**



**జమ్మికుంటప్రుజురాబాద్, ప్రభాత వార్త:** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మంగళవారం పలు కార్యక్రమాలతో సందడిగా మారింది. ప్రపంచ నర్సుల దినోత్సవ వేడుకలతో పాటు జిల్లా అధికారుల తనిఖీలు, అగ్నిప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**-- ఘనంగా నర్సుల దినోత్సవం...**

ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నర్సులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నల్ల నారాయణ రెడ్డి సమక్షంలో నర్సులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ ప్రసాద రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

**-- హెచ్.పి.వి టీకా కేంద్రం తనిఖీ...**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా హెచ్.పి.వి టీకా కేంద్రాన్ని సందర్శించి, టీకా పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఈ టీకా ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

**-- అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన...**

హుజురాబాద్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి వంటి రద్దీ ప్రదేశాలలో ప్రమాదం జరిగినప్పుడు రోగులను క్షేమంగా ఎలా తరలించాలో ఫైర్ సిబ్బంది ప్రత్యక్షంగా (డెమో) చేసి చూపించారు. ప్రతి ఒక్కరూ అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఉమా శ్రీ, ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్ - డబుల్ టైం నీట్ పేపర్ లీక్.

**సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గూగులోత్ సంతోష్ నాయక్.**



**ములుగుజిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ఎన్ టి ఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) కలిసి లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాయని సేవాలాల్ విద్యార్థి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా, మన రాష్ట్రం నుండి దాదాపు 70 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారనీ తెలిపారు. గతంలో కూడా నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినప్పటికీ, ఈసారి అయినా పకడ్బందీగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్ష నిర్వహిస్తారని అందరూ ఆశించారన్నారు. కానీ ఏ మాత్రం బాధ్యత లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని వాపోయారు.ఇప్పటికే ఎన్ ఎమ్ సి నిబంధనలను సడలిస్తూ, వైద్య ప్రమాణాలను పాటించకుండా మెడికల్ కాలేజీలకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తూన్నారన్నారు. వైద్య విద్యను ప్రమాదంలో పెట్టడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలో పెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే అధికారికంగా నీట్ పేపర్ లీకేజ్ జరిగిన విషయం నిర్ధారణ కావడం, 180 ప్రశ్నల్లో 135 ప్రశ్నలు లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థకు మచ్చగా మారిందన్నారు.దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కేంద్ర విద్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు.

## బీసీ గురుకులాల్లో సీఈసీ గ్రూపుకు యధాస్థానం

**దేవరకొండ, మే 12, ప్రభాత వార్త :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గంలో ఉన్నటువంటి బాలుర,బాలికల బిసి గురుకులాలలో సీఈసీ గ్రూపును గురుకుల సెక్రెటరీ సైదులు తొలగించి వేరే కళాశాలకు మార్చగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆందోళన చేసి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకి విజ్ఞప్తి చేయగా గురుకుల సెక్రటరీతో మాట్లాడి సీఈసీ గ్రూపును యధా స్థానంలో తీసుకువచ్చినందుకు దీనితో పాటు జిల్లాలో ఉన్నటువంటి అన్ని బీసీ గురుకులాల్లో తొలగించినటువంటి గ్రూపు లన్నింటినీ యదా స్థానంలో తీసుకొచ్చినందుకు ఆర్.కృష్ణయ్యకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఆయనకు దేవరకొండ నియోజకవర్గం, జిల్లా ప్రజల ప్రక్షాళన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ గురుకులాలకు ఆయన చేసిన సేవలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రోత్సహించే విధంగా సహకరించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి ,ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష రద్దు చేయడం దుర్మార్గం

కట్టంగూర్, మే 12, ప్రభాతవార్త,




రాజస్థాన్‌లో నీట్ పరీక్ష పేపర్ లీక్ జరిగిందని నిర్ధారించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) పరీక్షను రద్దు చేసినట్లు ప్రకటించడం దేశ విద్యా వ్యవస్థకు ఒక పెద్ద మచ్చగా నిలిచిందని బహుజన్ సమాజ్ పార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ విమర్శించారు. మంగళవారం అయిన కట్టంగూర్ లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో మైనర్ బాలికలపై జరుగుతున్న దారుణ ఘటనలు, అధికార పార్టీలకు చెందిన ప్రముఖుల కుటుంబాలపై వస్తున్న ఆరోపణల నుండి ప్రజలు ఇంకా కోలుకోకముందే, ఇప్పుడు నీట్ పేపర్ లీక్ వ్యవహారం బయట పడటం దేశ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా అనేక పరీక్షల లీకులు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా విద్య, ఉపాధి, విద్యార్థుల భవిష్యత్తు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, . ముఖ్యమంత్రి రాష్ట్ర విద్యార్థుల ఆందోళనలు, భద్రత, భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కాల్షియం డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల విద్య, పరీక్షల పారదర్శకత కంటే ఎన్నికలు, రాజకీయాలు, మత విద్వేషాలపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టడం బాధాకరమని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థి లోకానికి ఇది నిజంగా ఒక చీకటి రోజని కాన్సిరాం తెలిపారు

## దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి బదిలీ

**దేవరకొండ, మే 12, ప్రభాత వార్త :** దేవరకొండ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆర్.ఓ మధుసూదన్ రెడ్డి బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయనను రాష్ట్ర సచివాలయానికి (సెక్రటేరియట్) బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.దేవరకొండలో తన పదవీ కాలంలో మండల పరిపాలనలో తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు సచివాలయం వంటి కీలక విభాగంలో బాధ్యతలు చేపట్టనున్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కృషిని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.కొత్తగా దేవరకొండకు రాబోయే తహసీల్దార్ ఎవరనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.